# మిసిమి

మాస పత్రిక

అక్టోబర్-2000



వెల-రూ. 8/-

# చిత్రకారుని గురించి



ఎడ్వర్డ్ మంక్
(1863 - 1944)

ఎడ్వర్డ్ మంక్ నార్వేకు చెందినగొప్ప కళాకారుడు. ప్రతీకాత్మక వాదాన్ని బాగా ప్రతిబింబించిన వాడు అభివ్యక్తవాదులకు బాట చూపిన వాడు. చిన్న నాడే తల్లి, సోదరి మరణించడంతో, ఆ విషాదానుభూతి అతని కళకు ఒక అంధ అనుభూతిని పులిమింది.

మొదట్లో నార్వే రాజధానీ నగరంలో బొహెమియన్ కళాకారుల మండలితో అతనికున్న సంబంధం అతనిని ముద్రావాదం వైపుకు మళ్ళిస్తే, అప్పుడప్పుడు 1899 తరవాత అతడు పారిస్‌కు సలిపిన విహార యాత్రలు అతనిని ప్రతీకాత్మక వాదం వైపుకు తిప్పాయి.

1892లో అతడు బెర్లిన్‌లో ప్రదర్శన పెట్టినవెంటనే మూసివేయాల్సి వచ్చింది. ఎందుకంటే, ఒక కళా విమర్శకుడు ''అతని చిత్రాలకు కళకూ ఏమీ సంబంధం లేదని రాశాడు'' అందుకని అతనికి చెడ్డ పేరు వచ్చింది. ఆ తరవాత జర్మనీలో స్థిరపడి, ప్రేమ - మృత్యువుల వైయక్తిక ప్రతిమలను సమకూర్చే పని మొదలు పెట్టాడు అధికశ్రమ, త్రాగుడు, ఉద్వేగాల ఆటుపోటులతో 1908లో అతడు కుంగిపోయాడు. ఆ తరవాత అతడు నార్వే తిరిగి వచ్చి, తన అంతిమ సంవత్సరాలను ప్రజాకుడ్య చిత్రాలకు, శ్రామికుల జీవన అధ్యయనానికి వినియోస్తూ గడిపాడు. 1944లో ఇటలీలో మరణించాడు.

''లినార్డో డావిన్సీ మానవ దేహ నిర్మాణాన్ని ఎలా అధ్యయనం చేసి, కళేబరాలను కోసి పరిశీలించాడో, నేనూ అదేవిధంగా మనుషుల ఆత్మలను అధ్యయనం చేస్తాను'' అన్నాడు. ఎడ్వర్డ్ మంక్ ''కళ అనేది సజీవులైన ఊపిరి తీసే, ఉద్వేగానుభూతిని పొందగల బాధపడగల ప్రేమించగల సామర్థ్యం ఉన్న ప్రేమించగల సామర్థ్యం ఉన్న మనుషులకు సంబంధించింది అయి ఉండాలి'' అంటాడు. అతడి ఈ నమ్మకమే ఆధునిక కనీవినీ ఎరగని మానవుని గర్భకుహర అనుభూతులు, మానసిక వేదనల ప్రతిమలలో ప్రతిఫలించింది.

## ముఖచిత్రం : నగ్నత్వం

ఈ నగ్న చిత్రం అతడు చివరలో చిత్రించాడు. అతడు రంగులను ఎంత సున్నితంగా ఉపయోగిస్తాడు, చిత్రణలో ఉన్న నైపుణ్యం ఈ విషయాలకు ఈ చిత్రం అద్దం పడుతుంది. ఆమె తల వంచుకొని, సిగ్గు పడుతోంది. అది ఆమె చిత్తవృత్తిని ప్రతిబింబిస్తోంది. అలా సిగ్గుపడి తల దించుకోవడం ఆ వెల్తురులో ఆ గదిలో ఆమెను వేరుగా చూపుతోంది. అంతేకాదు, ఆమె శరీరపు వంపు సొంపులకు ఉపయోగించిన శీతల వర్ణాలు, దుప్పటికి ఉపయోగించిన ఉష్ణ వర్ణాలు మధ్య తేడా ఆమె చిత్తవృత్తిని మరింత ప్రస్ఫుటం చేస్తున్నాయి.

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**

సంపుటి 12 | అక్టోబరు 2000 | సంచిక 10

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**

## విషయ సూచిక

ఇరవయ్యో శతాబ్దికి రూపు రేఖలద్దిన పుస్తకాలు

పితృస్వామ్యం - బి. తిరుపతి రావు

ఇంకా వుంది - డా॥ యు. ఏ. నరసింహమూర్తి

మహాభారతం- రామాయణం - డా॥ పెదపాటి నాగేశ్వరరావు

కాలుష్య నివారణ – పారిశ్రామిక యాజమాన్యాల పాత్ర -సి. వి. సర్వేశ్వర శర్మ

సుమేరియన్ ప్యారడైజ్ ల్యాండ్ 'తెలమన్' భాష తెలుగు - సంయుక్త కూనియ్య

**విడిప్రతి రూ. 8/-  వార్షిక చందా రూ. 100/-  విదేశీయులకు $ 20**

ముఖచిత్రం : **నగ్నత్వం**

Printed & Published by BAPANNA ALAPATI at Kala Jyothi Process Ltd.,
1-1-60/5, R.T.C. X Roads, Musheerabad, Hyd - 20. Ph. 7645536
E-mail : misimi_m@hotmail.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

## ఇరవయ్యో శతాబ్దికి రూపు రేఖలద్దిన పుస్తకాలు...

కొన్ని పుస్తకాలు తాటాకు మంటలా తాత్కాలికంగా వెలిగి ఆరిపోతాయి. కొన్ని పుస్తకాలు కాలంలో అలాగే నిలిచిపోయి మానవాళి మీదచెరగని ముద్రవేస్తాయి. ఈ ఇరవయ్యో శతాబ్దిని అత్యంతంగా ప్రభావితం చేసి దానికి రంగు రుచి వాసనల నిచ్చిన కొన్ని మంచి పుస్తకాల జాబితాను ''లోగోస్'' (Logos) అనే ''ప్రపంచపుస్తకలోకం'' పత్రిక ఈ శతాబ్దం మలుపులో ప్రచురించింది. ఆ పత్రిక సలహా మండలికి చెందిన భిన్న ప్రవృత్తులున్న నలభైమంది పండితులు ఆ జాబితాను ఏరి కూర్చారు. బాగా అమ్ముడు పోయాయనో, బాగా విజయవంతాలయ్యాయనో కాక, మనిషి ఆలోచనా సరళిని ప్రభావితం చేసిన వాటిని ఎంపికచేశారు. వీటిల్లో ఎక్కువ గ్రంథాలు సామాజికశాస్త్రల విభాగానికిచెందినవే. అయినా, కల్పన, నాటకం, పద్యం విజ్ఞాన శాస్త్రం లాంటి వాటికి గూడ చోటు లేకపోలేదు.

మేధావులైన '**మిసిమి**' పాఠకులకు ఈ జాబితాలోని అధిక శాతం గ్రంథాలు పరిచితాలే అయి ఉంటాయనడంలో సందేహం లేదు. అయినా అందరికీ ఈ అన్ని పుస్తకాలతో సరిచయం ఉండక పోవచ్చు అనే ఉద్దేశంతో ఈ జాబితాను ప్రచురిస్తున్నాం.

\- సంపాదకుడు

| Date | Author/Title |
|---|---|
| 1900 | CONRAD, Joseph, *Lord Jim* |
| 1900 | FREUD, Sigmund<br>*The Interpretation of Dreams* |
| 1901 | CHEKHOV, P Anton<br>*The Three Sisters* |
| 1902 | LENIN, Vladimir Ilyich<br>*What Is to Be done?* |
| 1908 | GRAHAME, Kenneth<br>*The Wind in the Willows* |
| 1910 | CURIE, Marie<br>*Treatise on Radioactivity* |
| 1911 | TAYLOR, Frederick Winslow<br>*The Principles of Scientific Management* |
| 1913 | WHITEHEAD, Alfred North and RUSSELL, Bertrand, *Principia Mathematica* |
| 1913 | LAWRENCE, David Herbert<br>*Sons and Lovers*<br>*Lady Chatterley's Lover* |
| 1918 | EINSTEIN, Albert<br>*The Principle of Relativity: A Collection of Original Memoirs on the Special and General Theory of Relativity* |
| 1918 | STOPES, Marie, *Married Love* |
| 1920 | WEBER, Max<br>*The protestant Ethic and Spirit of Capitalism* |
| 1922 | HASEK, Jaroslaw<br>*Good Soldier Schweik* |
| 1922 | ELIOT, T S, *The Waste Land* |
| 1922 | JOYCE, James, *Ulysses* |
| 1923 | LE CORBUSIER<br>*Toward a New Architecture* |
| 1924 | MANN, Thomas<br>*The Magic Mountain* |
| 1925 | FITZGERALD, F Scott<br>*The Great Gatsby* |
| 1925 | KAFKA, Franz, *The Trial, The Castle* |
| 1926 | HITLER, Adolf, *Mein Kampf* |
| 1926 | LAWRENCE, T E<br>*The Seven Pillars of Wisdom* |
| 1926 | MILNE, A A, *Winnie-the-Pooh* |
| 1927 | PROUST, Marcel<br>*Rememberance of Things Past* |
| 1927 | GANDHI, Mohandas K<br>*The Story of My Experiments with Truth* |
| 1927 | WOOLF, Virginia, *To the Lighthouse* |
| 1928 | ELLIS, Havelock<br>*Studies in the Psychology of Sex* |
| 1928 | MEAD, Margaret<br>*Coming of Age in Samoa* |
| 1929 | FAULKNER, William<br>*The Sound and the Fury* |
| 1929 | HEMINGWAY, Ernest, *A Farewell to Arms*<br>*For Whom the Bell Tolls (1940)* |
| 1929 | REMARQUE, Erich Maria<br>*All Quiet on the Western Front* |
| 1932 | HUXLEY, Aldous, *Brave New World* |
| 1933 | MALRAUX, Andr'e, *Man's Fate* |
| 1936 | KEYNES, John Maynard<br>*A General Theory of Employment, Interest and Money* |
| 1937 | CARNEGIE, Dale<br>*How to Win Friends and Influence People* |
| 1938 | SARTRE, Jean-Paul, *Nausea* |
| 1939 | STEINBECK, John, *The Grapes of Wrath* |
| 1940 | GREENE, Graham<br>*The Power and the Glory*<br>*The Hearty of the Matter (1948)* |
| 1940 | KOESTLER, Arthur, *Darkness at Noon* |

1940 WRIGHT, Richard, *Native Son*

1941 BRECHT, Bertolt
*Mother Courage and her Children*

1941 BURNHAM, James
*The Managerial Revolution*

1942 CAMUS, Albert
*The Outsider*, *The Plague* (1947)

1943 SARTRE, jean-Paul
*Being and Nothingness (1946)*
*Existentialism and Humanism*

1944 HAYEK, Frederich A von
*The Road to Serfdom*

1945 ORWELL, George
*Animal Farm*
*Nineteen Eighty-Four (1949)*

1945 PEPPER, Karl
*The Open Society and Its Enemies*

1946 SPOCK, Benjamin
*The Common-sense Book of Baby and Child Care*

1947 FRANK, Anne
*The Diary of a Young Girl*

1948 KINSEY, Alfred C
*Sexual Behavior in the Human Male*

1948 PATON, Alan
*Cry, the Beloved Country*

1948 WIENER, Norbert
*Cybernetics*

1949 BEAUVOIR, Simone de
*The Second Sex*

1949 GOMBRICH, E H
*The Story of Art*

1949 MISES, Ludwig von
*Human Action*

1949 UNITED NATIONS
*The Universal Declaration of Human Rights*

1951 SALINGER, J D
*The Catcher in the Rye*

1952 BECKETT, Samuel
*Waiting for Godot*

1953 WITTGENSTEIN, Ludwig
*Philosophical Investigations*

1954 CHURCHILL, Winston
*The Second World War*

1954 GOLDING, William
*Lord of the Flies*

1954 MAO, Ze Dong
*The Thoughts of Chairman Mao*

1954 THOMAS, Dylan
*Under Milk Wood*

1955 LEVI-STRAUSS, Claude
*A World on the Wane*
*The Savage Mind (1962)*

1955 NABOKOV, Vladimir
*Lolita*

1956 O'NEILL, Eugene
*Long Day's Journey into Night*

1956 TOLKIEN, J R
*The Lord of the Rings 3 vols*

1957 HOGGART, Richard
*The Uses of Literacy*

1957 KEROUAC, Jack, *On the Road*

1957 PACKARD, Vance, *The Hidden Persuaders*

1957 PARKINSON, C Northcote,
*Parkinson's Law*

1957 PASTERNAK, Boris, *Doctor Zhivago*

1958 ACHEBE, Chinua, *Things Fall Apart*

1958 GALBRAITH, John K
*The Affluent Society*

1959 GRASS, Gunter, *The Tin Drum*

1959 SNOW, C P, *The Two Cultures and the Scientific Revolution*

1961 HELLER, Joseph, *Catch-22*

1962 BALDWIN, james, *Another Country*

1962 BURGESS, John Anthony
*A Clockwork Orange*

1962 CARSON, Rachel, *The Silent Spring*

1962 JUNG, Carl Gustav
*Memories, Dreams, Reflections*

1962 SOLZHENITSYN, Aleksandr
*One Day in the Life of Ivan, Denisovich*
*The Gulag Archipelago (1974)*

1963 FRIEDAN, Betty, *The Feminine Mystique*

1963 MCNEILL, William, *The Rise of the West*

1964 US SURGEON GENERAL
*Smoking and Health*

1967 GARCIA MARQUEZ, Gabriel
*One Hundred Years of Solitude*

1967 MCLUHAN, Marshal
*The Medium is the Massage*

1967 MORRIS, Desmond, *The Naked Ape*

1968 WATSON, James & CRICK, Francis
*The Double Helix*

1970 GREER, Germaine, *The Female Eunuch*

1973 SCHUMACHER, E F, *Samll Is Beautiful*

1974 DRUCKER, Peter F
*Management: Tasks, Responsibilities, Practices*

1980 ECO, Umberto, *The Name of the Rose*

1984 KUNDERA, Milan
*The Unbearable Lightness of Being*

1987 HAVEL, Vaclav, *Living in Truth*

1988 HAWKING, Stephen W
*A Brief History of Time*

1988 RUSHDIE, Salman, *The Satanic Verses*

1994 MANDELA, Nelson
*Long Walk to Freedom*

# 'పితృస్వామ్యం' : PATRIARCHY

-బి. తిరుపతి రావు

పితృస్వామ్యం : **(Patriarchy) :** అనే పదం వర్తమాన విమర్శనా సిద్ధాంతంలో, ముఖ్యంగా స్త్రీవాద విమర్శనా సిద్ధాంతంలో చాలా కీలకాంశం. సాదారణార్థంలో **"Patriarch"** అనే పదాన్ని కుటుంబానికి అధిపతిగానూ, పితృస్వామ్యాన్ని పురుషుడి పాలనగా, చట్టంగా భావించటం జరుగుతోంది! తండ్రి నుంచి కొడుక్కి, ఆ తరువాత అతని కొడుక్కి నిరంతరాయంగా సంక్రమిస్తూ వస్తున్న క్రమంగా పితృస్వామ్యాన్ని అర్థం చేసుకుంటారు. అయితే ఈ సాదారణ ఆలోచన 'పితృ స్వామ్యం' అనే పదానికి, వ్యవస్థకి వున్న తాత్విక, రాజకీయ పార్శ్వపు లోతుల్ని విస్మరిస్తుంది. అలాగే పితృస్వామ్యం అనేది మగవాడి ఆధిపత్యాన్ని, స్త్రీపరాధీనతని బలపర్చే ఒకానొక సామాజిక చట్రం అనే వివరణ కూడా పై భావనలో కన్పించదు.

పితృస్వామ్యంలో స్త్రీ, పురుషుడు అనే భిన్నలింగాల **(sexes)** మధ్య సంబంధం కేవలం వైయక్తికంగా కాక రాజకీయంగా వుంటుంది. ఈ సంబంధాన్ని అసమానత అనివార్యంగా ఆశ్రయించి వుంటుంది. ఈ వివరణకూడా పితృస్వామ్యాన్ని గురించిన మన సాదారణ అవగాహనలో కన్పించదు. ప్రముఖ స్త్రీవాద విమర్శకురాలు కేట్‌మిల్లెట్ పరిభాషలో చెపితో లైంగిక రాజకీయాల ప్రసక్తి పితృ స్వామ్యాన్ని గురించిన మన సాదారణ అవగాహనలో మచ్చుకు కూడా కన్పించదు.

మానవ సమాజ చరిత్రని స్థూలంగా పరిశీలించినా కూడా కుటుంబం, రాజ్యం, చట్టం, మతంలాంటి అన్ని జీవితరంగాల్లో స్త్రీ ఎప్పుడూ పరాధీనస్థితిలో, ద్వితీయ శ్రేణిలో వుంచబడుతూ వచ్చినట్టు స్పష్టమవుతుంది. ఈ రంగాలన్నింటిలో పురుషుడి సంబందంలో తప్ప స్త్రీకి స్వతంత్ర అస్తిత్వం లేదు. పురుషుడి సంబంధంలోంచి మాత్రమే స్త్రీని నిర్వచిస్తూ రావటం జరిగింది. స్త్రీ ఎప్పుడూ ప్రతికూల పార్శ్వంగా పరిగణింపబడింది. పురుషుడికి వున్న ఆధిపత్య స్వభావం శక్తి స్త్రీకి లేవని పురుష స్వామ్యం చేసిన ప్రచారంతోపాటు, స్త్రీకి పురుషుడికి వున్న లైంగిక అవయం శిశ్నం లేకపోవటం ఒక ప్రధాన లోపంగా పితృస్వామ్యం చిత్రించింది. తద్వారా స్త్రీ లైంగికతను నిరాకరిస్తూ పురుషలైంగిక ఆధిక్యతను ప్రచారం చేసింది. పురుషుడి శిశ్నాన్ని అధికారానికి సంకేతంగా పురుషస్వామ్యం చాటింపు వేసింది. పురుషలైంగికతను సాధికరీకరిస్తూ సమాజ క్రమాన్ని పురుష లైంగికత ప్రాతిపదికమీదనే నిర్మించింది.

ఈపై భావనల్ని మరింత లోతుగా అర్థం చేసుకోవటం అవసరం. శాబ్దికంగా పితృస్వామ్యం అంటే తండ్రి శాసనం లేక చట్టం **(rule)** అని అర్థం. పితృ స్వామ్యం అనే పదాన్ని ప్రారంభంలో వాడుకలోకి తెచ్చిన వాళ్ళు ఆంత్రోపాలజిస్టులు. అసలీపదం **"Rule of Father"** అనే అర్థాన్ని స్ఫురింప జేసే గ్రీకు పదం నుండి రూపొందినట్టు చెపుతారు. స్త్రీలమీద పురుషులు అమలు చేసే అధికారాన్ని ఈపదం సూచిస్తుంది. అయితే స్త్రీవాదులు పితృస్వామ్యాన్ని స్త్రీల మీద ఆధిపత్యం కొనసాగించటం కోసం

అమలులో వున్న మౌలికాంశంగా పరిగణిస్తారు. ఒక పురుషుడి అఖండ అధికారం క్రింద వుండే ఏ సామాజిక వ్యవస్థనయినా సూచించటం కోసం ఆంత్రో పాలజిస్టులు ఈ పదాన్ని వాడారు. అయితే స్త్రీ వాదులు 1970ల నాటికే నిర్దిష్ట రూపం తీసుకున్న నేపథ్యంలో స్త్రీవాదులు పితృస్వామ్యాన్ని మరింత స్పష్టంగా విశ్లేషించారు. ఇది ఏ ఒక్క సామాజిక వ్యవస్థకో పరిమితమయిన అంశంగా కాక విశ్వజనీనంగా విస్తరించి వున్న రాజకీయ, భావజాల వ్యవస్థగా స్త్రీవాదులు గుర్తించారు. సామాజిక వ్యవస్థల్ని క్రమబద్ధీకరించటంలో పితృస్వామ్యపు పాత్ర విశేషంగా వున్నట్టు స్త్రీ వాదులు గుర్తించారు.

పితృస్వామ్యం వివిధ చారిత్రకస్థితుల్లో, సాంస్కృతిక సందర్భాలలో బహు ముఖంగా రూపాంతరం చెందుతూ వస్తున్నప్పటికీ స్త్రీని అణిచివేయటం, పరాయి (other) గా చూడటం అనేది మాత్రం అన్ని స్థితుల సామాన్య లక్షణంగా వుంటూ వచ్చింది. రాజకీయ, సాంఘిక క్షేత్రాల నుంచి స్త్రీని నిషేదించటం జరిగింది. లింగ వివక్షత ప్రాతిపదికగా పితృస్వామ్యం ఉత్పాదకశ్రమని, పునరుత్పాదక శ్రమని విభజించింది. ఆక్రమంలో స్త్రీ యొక్క భౌతిక, భౌతికేతర వనరుల మీద పురుషాధిపత్యాన్ని నెలకొల్పింది. 'మగవాణ్ణి', 'మగతనాన్ని' సాధికారిక స్థానంలో నిలిపి స్త్రీని, 'స్త్రీత్వాన్ని' ద్వితీయ శ్రేణిలోకి పితృస్వామ్యం నెట్టివేసింది. అలాగే పితృస్వామిక వ్యవస్థ అనేక ప్రవచనాత్మక (discursive), ప్రతీకాత్మక వ్యవస్థలద్వారా పురుష విషయత్వాన్ని (subjectivity) కేంద్ర, ప్రామాణిక స్థానాల్లో నిలిపి స్త్రీ వస్త్వీకరింపబడిన పరాయిగా చిత్రించింది.

ఈపై నేపథ్యాన్ని గుర్తించిన స్త్రీ వాదులు లింగ వివక్షతమీద, పితృ స్వామిక వ్యవస్థల మీద ఉద్యమం ప్రారంభించారు. ఈ క్రమంలో స్త్రీవాద బృందాల మధ్య పితృస్వామ్యం గురించిన నిర్వచనాలమీద తీవ్ర చర్చలు జరిగాయి. ఇంకా జరుగుతున్నాయి. మొన్నటి సిమోన్ దబోవా ఇప్పటి హిలెన్ సిస్సూ వరకు ఈ క్రమం నడుస్తూనే వుంది. దాదాపు ప్రతి చారిత్రక దశలోనూ వుంటూ వచ్చిన ప్రతి సాంస్కృతిక నిర్మాణాన్ని నియంత్రిస్తూ వున్న పురుషాధిపత్యాన్ని శరీర నిర్ణయక వాదానికి (biological determinism) అతీతంగా విశ్లేషించటం సాధ్యమేనా? పురుషాధిపత్యం సహజమైనదిగా భావించి దాన్ని ఆమోదించటం అనివార్యమా? లేకపోతే పితృ స్వామ్యమనేది సంస్కృతులలో వచ్చిన కొన్ని చారిత్రక పరిణామాల పర్యావసానం కాబట్టి దాన్ని మార్చే వీలుందా? మొదలైన కీలక అంశాల మీద స్త్రీ వాదుల మధ్య చర్చలు నడిచాయి.

1969లో వెలువడిన కేట్‌మిల్లెట్ "Sexual Politics" అనే పుస్తకం పితృ స్వామ్యాన్ని విశ్లేషించటంలో ఒక మైలురాయిగా పరిగణించబడుతోంది. జండర్‌సమస్యలు, కుటుంబ స్వభావం, సామాజీకీకరణ క్రమం మొదలైన వాటిని ఈ పుస్తకం విశ్లేషించింది. స్త్రీ, పురుషుల మధ్య వున్న రాజకీయ సంబంధం పితృస్వామ్యపు కీలకాంశంగా మిల్లెట్ భావించటం జరిగింది. అసలు లైంగిక చర్యలోనే పురుషాధికారం ఆవిష్కరించబడుతుందనేది మరొక వాదన. కొంతమంది స్త్రీవాదులు అశ్లీల రచనల్లో, రేప్ మొదలైన వాటిల్లో ఆవిష్కరించబడుతున్న అధికారాన్ని విశ్లేషించే ప్రయత్నం చేశారు. ఇంకొంత మంది బహిరంగ, వైయక్తిక స్థలాల్లో స్త్రీమీద కొనసాగుతున్న అణచివేతల్ని, వాటి

భౌతిక పునాదుల్ని చర్చించారు. పితృస్వామిక భౌతిక పునాదుల్ని విశ్లేషించే ప్రయత్నం అంతకుముందెప్పుడో తన 'కుటుంబపు పుట్టుక, వ్యక్తిగత ఆస్తి, రాజ్యాంగ యంత్రాల పుట్టుక' (1884) లో ఎంగెల్స్ చేసేవున్నాడు. ఆ పుస్తకం పితృ స్వామ్య సిద్ధాంతాన్ని ఒక నిర్దిష్ట ఉత్పత్తి విధానంలో గుర్తించే ప్రయత్నం చేసింది. వర్గానికి ప్రాధాన్యత ఇవ్వటం ఈ రచనలో కన్పిస్తుంది. అయితే ఇందుకు భిన్నంగా 1970లో ప్రచురింపబడిన **"The Diabctic of sex"** అనే పుస్తకంలో **Firestone** అనే ఆమె శరీర భౌతికవాదాన్ని **(Biologocial Materialism)** ప్రస్తావించింది. అలాగే వర్గం స్థానంలో లింగ ప్రాధాన్యతని నొక్కి చెప్పింది. ఆ తరువాత ఈ పరిణామవాద ఆదారిత ఊహల్ని ఖండించటం, అసలు శరీర భౌతికవాదాన్ని తిరస్కరించటం కన్పిస్తుంది.

కొంతమంది స్త్రీవాదులు స్త్రీపురుషుల మధ్య అంతరాలకి కారణం శరీరం కాబట్టి లేక శరీరం కీలకాంశం కావటంవల్ల అవి సహజమైనదిగా గుర్తింపబడటం జరిగిందని అంటారు. సరైన బర్త్‌కంట్రోల్ పద్ధతులు లేక పోవటమనే భౌతిక పరిస్థితులు కూడా అంతరాలకి కారకమయి వుండ వచ్చునని వాళ్ళునమ్మారు. అయితే కొంత పునరుత్పత్తి సాంకేతికత్వాలు రంగం మీదకి రావటంతో ఎంతో కొంత భౌతికస్థితి మారి స్త్రీవాద విప్లవం మొదలైందంటారు. ఇంకొంతమంది స్త్రీవాదులు ఎప్పుడయితేపితృ స్వామ్యం అనే శరీర సంబంధ క్రమం **(biological process)** స్పష్టమయిందో, పితృత్వం **(Fatherhood)** అనేది ఒక వాస్తవికత ఆవిర్భవించిందో ఆక్షణం నుంచి రక్త సంబంధీకుల మధ్య లైంగిక చర్యలకి **(incest)** ప్రతిగా పితృస్వామిక సంబంధం **(kinship)** మొదలైంది. ఆ క్రమంలో పురుషుడు తన గృహ, సామాజిక సంబంధాల్ని నియంత్రించటం కోసం స్త్రీని పరాధీన స్థితిలోకి నెట్టివేశాడు.

పురాతత్వ శాస్త్ర పద్ధతుల్లో కృషిచేసిన స్త్రీవాదులు చరిత్రకు ముందు దశలో అమలయిన మాతృ స్వామ్య వ్యవస్థల్ని లేక పితృస్వామికేతర వ్యవస్థల్ని విశ్లేషించి క్రమంగా అవి పితృస్వామ్య వ్యవస్థల చేత ఎలా ధ్వంసం చేయబడ్డాయో రుజువు చేశారు. ఇప్పటికే కొంతమందిస్త్రీవాదులు స్త్రీదేవతలు ఆధారంగా కొనసాగుతున్న మతాల్ని విశ్లేషించే ప్రయత్నం చేస్తున్నారు. పర్యావరణ స్త్రీవాదంలో **(Eco-Feminism)** కూడా ఈ ఛాయలు చూడవచ్చు.

ఈ మధ్య కాలంలో, ముఖ్యంగా గత రెండు మూడు దశాబ్దాల కాలంలో స్త్రీవాదం చాలా మౌలిక మార్పుకి గురయింది. ఏ అంశాన్నయినా దాన్ని నిర్దిష్టమూలాల్నించి తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో అనివార్యంగా వుండే అనిశ్చితతని సమకాలీన తాత్వికులు ప్రస్తావిస్తున్నారు. స్త్రీవాదానికి కూడా ఇది వర్తిస్తుంది. ఒక అంశాన్ని ఒకే తాత్విక చట్రం నుండి అర్థం చేసుకోవడానికి చేసేప్రయత్నం, వ్యాఖ్యానించటానికి చేసే కృషిసారాంశంలో పాక్షికంగా మాత్రమే మిగులుతుందనేది వర్తమాన తాత్విక అవగాహన. అందువల్ల అటువంటి ప్రయత్నాల మీద సంశయాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో బాగంగానే పితృస్వామిక ఆధిపత్యాన్ని ఇతర ఆధిపత్య రూపాల నుంచి విడదీసి చూడటం కుదరదనే గుర్తింపు ఇవ్వాళ ఏర్పడింది. ఉదాహరణకి పితృస్వామిక ఆధిపాత్యాన్ని జాతి సంబంధ ఆధిపత్యం నుంచి, పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాలనుంచి విడదీసి ఆలోచించటం కుదరదు. కొన్ని

సందర్భాలలో అసలు పితృస్వామ్యాన్ని కొనసాగించటంలో ఈ ఇతర ఆధిపత్య రూపాలే కీలకంగా వుంటున్నాయనే భావన కూడా ఇటీవల బలపడింది.

రాడికల్ స్త్రీవాదులు లింగ వాదం **(sexism)** అనేది చాలా ప్రముఖ అంశమని, సమాజంలో జాతి, వర్గంలాంటి విభజనలకి కూడా అదే కొన్ని సందర్భాలలో ఆధారబూతంగా వుంటుందని భావిస్తారు. పితృస్వామ్యం శరీరాన్ని ప్రాదమికం చేసే విధానాన్ని వాళ్ళు ఖండించారు. పురుషాధిపత్యం అనేది స్వయం ప్రతిపత్తిలో కొనసాగుతున్నప్పటికీ, విశ్లేషణాత్మకంగా దాన్ని వేరు చేసే అవకాశం వున్నప్పటికీ అంతిమంగా పితృస్వామ్యాన్ని వర్గనిర్మాణం నుంచి, వర్గపోరాటం నుంచి విడిగా చూడాలని భావించారు. పితృస్వామిక దోపిడీ అనేది అన్ని వర్గాల్లో సామాన్య లక్షణంగా వున్నదని వాళ్ళు భావిస్తారు.

నల్లజాతి స్త్రీవాదులు 'పితృస్వామ్యం' అనే పదం స్త్రీలందరూ ఒకే విధంగా, ఒకే వర్గంగా అణిచివేతకు గురవుతున్నారనే భ్రమకలిగిస్తుందని, నిజానికి స్త్రీలు అందరూ ఒకే రకమయిన అణిచివేతకు గురికావటం లేదని, ముఖ్యంగా నల్ల జాతి స్త్రీలు అదనంగా జాతి సంబంధమయిన వివక్షతకు కూడా గురవుతున్నారని అందువల్ల వాస్తవాన్ని పూర్తిగా 'పితృస్వామ్యం' ప్రతిబింబించ లేక పోతుందని ఆపదాన్ని నిరాకరిస్తారు.

స్థూలంగా ఇంకొన్ని విషయాలు చెప్పుకోవాలంటే పితృస్వామ్యం స్త్రీలను కేవలం పురుషాధిపత్యంలో వుంచటం మాత్రమే కాకుండ స్త్రీలే తమ పరాధీనతని, ఆధిపత్యానికి గురయ్యే క్రమాన్ని ఆంతరంగీకరించుకుని అదే సరైన క్రమంగా స్త్రీలే నమ్మే విదానంగా మారటం వల్ల కూడా పితృ స్వామ్యాం వర్ధిల్ల గలుగుతోంది. స్త్రీత్వం, పురుషత్వం అనే ఒకానొక సాంస్కృతిక విభజనకి కారకమయ్యే జండర్ భావన అత్యంత కీలకాంశం. మనిషి ఆలోచనని ఈ జండర్ భావన చాలా తీవ్రంగా నిర్ధేస్తూవుందనే గుర్తింపుకు స్త్రీవాదులు వచ్చారు. జండర్ ఒక రకంగా పితృస్వామ్యానికి ఇరుసు. లింగం **(sex)** ఆడ, మగ అనే శరీర సంబంధం విభజనకి కారణమయితే జండర్ స్త్రీత్వం, పురుషత్వం అనే సాంస్కృతిక విభజనల్ని సృష్టించింది. అందుకే లింగం శరీర సంబంద అంశం గానూ, జండర్ సాంస్కృతిక నిర్మితిగానూ పరిగణింపబడుతోంది. జండర్ విభజన కార్యచరణకి, హేతుబద్ధతకి, ధైర్యానికి పురుషుడ్ని చిహ్నంగా చూపిస్తు, ఉదాసీనత, నిర్లిప్తత, భావుకతలకు స్త్రీని సంకేతంగా చిత్రిస్తుంది. జండర్ అధ్యయనాలు **(gender studies)** పేరుతో ఇవ్వాళ ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న స్త్రీవాద పరిశోధనలు పితృస్వామ్యాన్ని బహుముఖంగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నాయి. సాహిత్యం, చరిత్ర, సంస్కృతి మొదలైన అంశాలలో స్త్రీని నిర్వచించిన క్రమాల్ని ఈ అధ్యయనాలు బహిర్గతం చేస్తున్నాయి.

సాహిత్యంలో కూడా పితృస్వామ్యం కొన్ని సాహిత్య సంప్రదాయాల్ని, విలువల్ని ప్రతిష్టించటం ద్వారా కొనసాగుతుంది. గొప్ప పుస్తకాలు, గొప్పరచయితలు అనే భావనలు పితృస్వామ్య భావనలే. పురుష ప్రయోజనాలకి అద్దం పట్టే వాచకాల్ని కీర్తించటం ద్వారాకూడా సాహిత్యంలో పితృస్వామ్యం కొనసాగుతుంది.

# ఇంకా వుంది

## (1999 నోబెల్ సాహిత్య పురస్కార స్వీకారోపన్యాసం)

మూలం: గుంటర్ గ్రాస్ అనువాదం : డా. యు. ఏ. నరసింహమూర్తి

మాన్య స్వీడిష్ అకాడమీ సభ్యులారా! సోదర సోదరీమణులారా!

ఈ ప్రకటనతో 19వ శతాబ్దపు సృజనాత్మక రచనలు నిరంతర గమనాన్ని కొనసాగించగలవు. పత్రికలు వాటికి తగినంత అవకాశాన్నిచ్చాయి. ధారావాహిక నవలల కిది స్వర్ణయుగం. ఈ యుగపు తొలి అధ్యాయాలు శరపరంపరగా సాగాయి. కీలకమైన నడిమిదశ అంతా దీర్ఘమునాన్ని కొనసాగించింది. ముగింపు ఎలా ఉంటుందో ఇంకా అంతుపట్టడం లేదు. చౌకబారు భయానకగాథలు, కన్నీటి వరదలే ఈదశలో పాఠకుణ్ణి కట్టుబానిసను చేసాయనుకోవడానికి లేదు. ఛార్లెస్ డికెన్స్ నవల లన్నో దఫ దఫాలుగా ధారావాహికలుగా వచ్చాయి. టాల్‌స్టాయ్ 'అన్నాకెరినినా' ధారావాహిక నవల బాల్జాక్ తరం ఒక నిర్విరామ ధారావాహిక రచనల కార్ఖానా అయింది. వచ్చే భాగం కోసం ప్రతివాయిదా చివరిలో కథను పతాక స్థితిలో నిలిపి ఉంచే రచనాశిల్పాన్ని మలిచి చూపిన రచయిత లీకాలంలో పరిఢవిల్లారు. ఫాంటేన్ నవల లన్నీ దాదాపుగా మొదట పత్రికల్లో ధారావాహికలుగా వచ్చినవే. ఈ మురికిముండా ధారావాహికం **(Trials and Tribulations)** ఎప్పటికైనా ముగుస్తుందా అని కోపంతో ఊగిపోయిన ప్రకాశకులున్నారు.

నా మాటల చిక్కుముడిని ఇంకా బిగించకముందే స్వచ్ఛమైన సాహిత్య దృష్టితో నేనొక అంశాన్ని చెప్పదలుచుకున్నాను. నన్ను ఆహ్వానించిన ఈ స్వీడిష్ అకాడమీ, ఈ సమావేశ మందిరం నాకు కొత్తవి కావు. పధ్నాలుగేళ్ల కిందట నా ''ఎలుక'' **(The Rat)** అనే నవల వెలువడింది. విభిన్న వక్రతా నిర్భరములైన కథన రీతులు నిండిన ఆ నవల దురంతగతి ఇప్పటికీ నా పాఠకు లొకరిద్దరికైనా గుర్తుండి వుంటుంది. ఆ ఎలుకకు, ఇంకా చెప్పాలంటే ప్రయోగశాల ఎలుకకు మీ స్థాయి శ్రోతల ఉదార ప్రశంస లభించింది. ముందో - వెనకో ఆ ఎలుకకు నోబెల్ బహుమానం వచ్చింది. పందులు, కోతులు వంటి లక్షలాది ప్రయోగశాల జంతువుల ప్రతినిధి అది. ఎలాగైతేనేం దానికి దక్కవలసిన ఖ్యాతి దానికి దక్కింది. వైద్య రంగంలో జన్యుకణ క్రీడాంగణమనే అనంతమైన పచ్చికబయలు మీద వాట్సన్ **(Watson)**, క్రిక్ **(Crick)** అనే నోబెల్ బహుమతి గ్రహీతలైన శాస్త్రజ్ఞుల అత్యున్నత పరిశోధనలకు, నూత్న గవేషణలకు సంభావ్యత సిద్ధింపజేసినట్లు, ఇతరులందరికన్నా ఎక్కువగా, నా నవలా కథనం కొనసాగించిన ఆ ఎలుక చెప్పుకుంటుంది. ఆ నవల ముగింపుకు వచ్చేటప్పటికి మానవశకం అంతరించి ఎలుక మానవులు నిండి వుంటారు. వాళ్లను వాట్సన్ క్రిక్స్ **(Watson Cricks)** అంటారు. అప్పటి నుండి చట్టబద్ధంగానో, చట్ట విరుద్ధంగానో జొన్నల్నీ ఇంకా మిగిలిన కూరగాయల్నీ కలగలిపి సంగమాతీత సంతానోత్పత్తి చేయవచ్చు ననిపిస్తుంది. అన్ని రకాల జంతువులకు ఇది వర్తిస్తుంది. రెండు జాతుల ఉత్తమ లక్షణాలను అవి కలుపుతాయి. మనుష్యులలోని ఉత్తమ గుణాలు ఎలుకలకు, ఎలుకలలోని ఉత్తమ గుణాలు మనుష్యులకు వస్తాయి. మళ్లీ కోలుకోదలచిన ప్రపంచం ఈ ఏకీకరణ ప్రక్రియను ఉపయోగిస్తున్నట్లు కనిపిస్తుంది. ప్రళయానంతరం ఎలుకలు, బొద్దింకలు, రెక్క పురుగులు, చేప పిల్లలు కప్పగుడ్లు మాత్రమే మిగుల్తాయి. అది అస్తవ్యస్తస్థితి నుండి వ్యవస్థ నేర్పరచవలసిన కాలం. వాట్సన్‌క్రిక్‌ని **(Watson Cricks)** ఆ సమయంలో ఇనుమిక్కిలిగా ఉపయోగపడతాయి.

ఆ కథనానికి సంబంధించిన చిక్కుముడిని 'ఇంకా వుంది' అన్న ఒక్క మాటతో సులభంగా ముగించవచ్చును. ప్రయోగశాల ఎలుకను గూర్చిన ఈ నోబెల్ సాహిత్య పురస్కారోపన్యాసం ఆ నవలను సుఖాంతం చేయడానికి ఉద్దేశించినది కాదు. నేనిప్పుడు సూత్రప్రాయంగా దాని మనికిని, కళాకృతిని తెలియజేస్తాను.

ప్రజలెప్పుడూ కథలు చెప్తారు. మనిషి రాతకోతలు నేర్చుకోకముందే ప్రతివాడూ ఇంకొకడికి కథకుడయ్యాడు; శ్రోత అయ్యాడు. కథ చెప్పడమంటే అబద్ధాల్ని నమ్మేలా చెయ్యడమే. ఈ పనిలో చదువు వచ్చిన వారికంటె రానివాళ్లే మెరుగనిపించేరు. అంతూ పొంతూలేని వాళ్ల అబద్ధాలకు చలామణీ ఎక్కువ. నిదానంగా పల్లానికి పారే కాలువలాంటి కథని కష్టాల వరదల్లోకి పొంగి పొర్లించి, పారనీకుండా ఎండనీకుండా ఆచి ఉంచి అకస్మాత్తుగా, ఆశ్చర్యకరంగా దాన్నొక విశాలమైన జలాశయంగా మార్చి, అందులోకి తాడు ఒడిసే లేని ఉపకథలెన్నింటినో విరజిమ్మే కళాకౌశలం వారికి వెన్నతో పెట్టిన విద్య. ఈ అనాది కథకులు సూర్యకాంతి గాని, దీపకాంతిగాని లేకుండానే చీకట్లను చీల్చుకుని పోగలరు. అసుర సంధ్యను, అంధ తమస్సును సొమ్ము చేసుకోవడంలో నిష్ణాతులు వాళ్లు. మరు భూములను చూసిగాని, జలపాతాల గర్జా ఘోషలను వినిగాని వాళ్లు ఆగరు. శ్రోతల శ్రద్ధ సడలిపోతున్నట్లుగాని, శ్రోతలెందరో తమ కథల్ని చెప్పడానికి తలపడుతూన్నట్లు గాని ఉప్పందినవెంటనే మాత్రం వాళ్లు ''ఇంకా వుంది'' అన్నమాటతో తమ కథనాన్ని ఆపేస్తారు.

రాత రాని కాలంలో చెప్పుకున్న కథలేమిటి? హత్యలు, ఊచకోతల్తో నిండిన కథలవి. ఇద్దరి మధ్య కురిసే నిరంతర రక్త వర్షాలు కథల కెప్పుడూ మంచి వస్తువులయ్యాయి. వరదలు - వఱపులు వృద్ధిక్షయాలు ఆరంభమైన తొలిరోజుల్లోనే జాతుల్ని తుడిచిపెట్టే మారణ ప్రక్రియ ఆరంభమయింది. పశువులు, బానిసలతో నిండిన కొండవీటి చేంతాళ్లలాంటి జాబితా లన్నింటినీ నిక్కచ్చిగా ఒప్పుకోవచ్చును. ఏగాథా - అందులోనూ ఏ వీరగాథా విస్పష్టమైన వంశ వృక్ష వివరణ లేనిదే నమ్మదగ్గది కాదు. మొదట్లో ముక్కోణపు ప్రేమకథలు, భూతప్రేత పిశాచాల కథలు, నర - కేసరుల కథలు గల్లీలలో తొక్కిసలాడుకుంటూ, నురుగులు కక్కే జన సమూహ తరంగాల వెనుక వేచి ఉండే ప్రజాసందోహాన్ని అమితంగా ఆకర్షించాయి. ఆ గాథలే కొంచెం మెరుగెక్కి, కొనలుసాగి, చక్కదిద్దుకుని, పూర్తిగా వేషం - రీతి మార్చుకుని వ్యతిరేక దిశలో పురాణగాథలు, సాహస సముద్ర యాత్రా కథలుగా అవతరించాయి. చివరికి ఏ హోమరో, బైబిలును చెప్పిన అజ్ఞాత కథకులో రచయితలుగా నిలిచేరు. చైనా, పర్షియా, ఇండియా, పెరూ పర్వత భూముల్లోనే రచన వికసించిన చోటల్లా సామూహికంగానో, వ్యక్తిగతంగానో, జ్ఞాతంగానో అజ్ఞాతంగానో, రచయితలు విద్యావంతులయ్యారు.

రాతనేర్చిన తర్వాత కూడా ఆశుకథన సంప్రదాయం నిలిచే ఉంది. ఆశు సంప్రదాయం గొప్పది. అది లేకపోతే మనం లిప్తలిప్తకూ అక్షరాల కందకుండా వెలువడే అవ్యక్త సందిగ్ధతను, భయోద్విగ్నతలు నిండిన ఊరవడిని, పడకూడని చెవి కందని గుసగుసలను, గర్జాడంబరాల దగ్గర నుండి తూష్ణీభావాల దాకా ఉండే జీవన సారభూతాలైన ఆవిష్కార మార్గాలన్నింటినీ లిఖిత సంప్రదాయంలో మరచిపోవలసి వస్తుంది. మన కథన రీతులన్నీ నిర్జీవ గ్రంథాలలో శుష్కించి బూజెక్కి పోతాయి.

అయినా గ్రంథాలు దొరకడం కూడా మన మంచికే. మౌనంగా చదివినా, గొంతెత్తి చదివినా అవి శాశ్వతంగా ఉంటాయి. అవి నన్ను ప్రభావితుణ్ణి చేసాయి. మలిచి పోత పోయడానికి సిద్ధంగా ఉండే యౌవన దశలో మెల్‌విల్లే, డబ్లిన్, లూథర్ వంటి మహారచయితలు సిరాను ఉమ్ములో కలుపుకుని కంఠమెత్తి ఆశుసంప్రదాయ లక్షణాలన్నింటితోను ఆలపించేలా చేసారు. ఇంతలో ఏమంత పుట్టి మునిగి పోలేదు. బాధల ఏభయ్యోపడిలో పడికూడా రచన అనే చెమటోడుస్తూ కొరుకుడు పడని, బిర్రబిగిసిన వాక్యఖండాల్ని నేను మైనం ముద్దలుగా మార్చి చప్పరించేవాణ్ణి. ఏకాంత యవని కాభ్యంతరంలో వలవలిడిచేవాణ్ణి. అసలైన లయ - కాలము, శ్రుతి - ప్రతిశ్రుతి అందినప్పుడు మాత్రమే కాగితం మీద కలం పెట్టేవాణ్ణి.

నిజంగా ఈ ఆహ్వానాన్ని నేను ప్రేమిస్తున్నాను. ఇది నాకు సత్సంగతిని కలిగిస్తూంది. నా రాత ప్రతుల్ని యథాతథంగా అనువదించే స్వరప్రస్తారాల సంగతుల సాంగత్యమది. నా పుస్తకాలను చదివి వినిపించడం కంటె నా కింకొక ఆనందం లేదు. ఎన్నాళ్ల కిందటో పాఠకులు దోచుకుని పోయి పంజరబద్ధం చేసిన రచనలవి. ఆ పుటల్లో ప్రశాంతంగా నిద్రించే రచనలను గొంతెత్తి వినిపించడం కంటె నాకింకొక ఆనందం లేదు. భాషకు పెడముఖంగా ఉండే యువకులకు, చింతచచ్చినా పులుపు చావని వృద్ధులకు స్వరంగా మారిన అక్షరం మళ్లీ మళ్లీ మంత్రదండంగా పని చేస్తూనే ఉంటుంది. కాలానికెదురీది కటిక నిజాలను చెప్పబూనిన రచయిత వైఖరికిదొక మర్మమార్గము ''ఇంకా వుంది'' అన్న రచయిత అవ్యక్తవాగ్దానాన్ని ప్రతి ఒక్కరూ విశ్వసిస్తారు.

అంతవరకు నాకు దడ పుట్టించిన తెల్ల కాగితం మీద ఒక్కసారిగా నేను కవిని, రచయితను, కళాకారుణ్ణి ఎలా అయ్యాను? ఏ భరోసా ఒక బాలుణ్ణి ఈ అదుపు తప్పిన ఉద్వేగానికి వశమయ్యేలా చేసింది? మరీ పన్నెండేళ్ల పసిప్రాయంలో కళాకారుణ్ణి కావాలనే నాలోని కోర్కె నాకు తెలిసింది. అవి రెండవ ప్రపంచ యుద్ధం మొదలైన రోజులు. అప్పుడు నేను డాంజిగ్ **(Donzig)** నగర పొలిమేరల్లో ఉంటూ ఉండేవాణ్ణి. ఒక ఏడాది తర్వాత నేను రచయితగా అభివృద్ధి పొందే అవకాశం ఒకటి చిక్కింది. ''చేయూత'' అన్న హిట్లర్ పత్రికలో నేనొక ప్రకటన చూసేను. అది ఒక కథల పోటీ. దానికి బహుమతులున్నాయి. వెంటనే నేనొక నవల రాయాలనుకున్నాను. నా తల్లి చరిత్రతో ప్రభావితుణ్ణై రాసిన ఆ నవలకు **"The Kasulians"** అని పేరు పెట్టేను. అది 13వ శతాబ్ది నాటి ఒకానొక అరాచకస్థితికి చెందిన కథ. అడవి దొంగలు - దొంగల నాయకులు పర్వతశ్రేణుల్ని పాలిస్తున్న రోజులు. ప్రజాన్యాయ స్థానాల్లో మాత్రమే రైతులకు న్యాయం లభించేది.

కసూబియా నదీ తీరాల్లోని పగలు నిండిన దోపిడులు, ఊచకోతల వెనుకనున్న ఆర్థిక పరిస్థితుల సూక్ష్మ రేఖా చిత్రణం మాత్రం నాకింకా జ్ఞాపకం ఉంది. అక్కడన్నీ పీకలు నొక్కడాలు, కత్తిపోట్లు, కొఱత వేయడాలే. లెక్కలేనన్ని ప్రజాన్యాయ స్థానాలు ఉరితీతలు మరణశిక్షలు. మొదటి అధ్యాయం ముగిసేటప్పటికే ప్రధాన పాత్రలు, చాలా అప్రధాన పాత్రలు మరణిస్తాయి. పాతి పెట్టిన వాళ్లను పాతిపెట్టేరు. కాకులికి గద్దలకి వదిలేసిన వాళ్లను వదిలేసారు. శవాలను దయ్యాలుగా మార్చడానికి, ఆ నవల నొక దయ్యాల కథగా మార్చడానికి అడ్డు పడిన నా శైలీ స్పృహముందు తలవంచక తప్పని స్థితిలో నేనా నవలను ముగించక తప్పలేదు. 'ఇంకా వుంది' అన్నమాట రాయలేదు. మంచో చెడో అయింది గాని కొత్త పూజారి పాఠం నేర్చుకున్నాడు. ఇంకో పర్యాయం తన పాత్రలతో మృదువుగా ప్రవర్తించే సరళి తెలిసింది.

రాయడానికి ముందు నేను చాలా చాలా చదివేను. చెవుల్లో వేళ్లు దూర్చుకుని చదవడం నా కలవాటు. నేను, నా చెల్లెలు దరిద్రపు జీవితం గడపేము. మాది రెండు గదుల ఇల్లు. మాకంటూ ఒక గదిగాని, మూలగాని ఉండేది కాదు. అదే తర్వాత నాకు పనికొచ్చింది. రణగొణ ధ్వనుల మధ్య శ్రద్ధను నిలుపుకునే శిక్షణ నాకు లభించింది. నేను ఒక గంట జాడీ కింద ఉన్నాననుకునే టంతగా పుస్తక ప్రపంచంలో నిమగ్నుడనయ్యేవాడిని.

ఇప్పటికీ నేనదే మాదిరిగా చదువుతాను. చదివేటప్పుడు పరధ్యానమనే దుండదు. మా పుస్తకాలు నీలిపరదాలు కప్పిన అద్దాల పెట్టెలో ఉండేవి. మా అమ్మ ఒక పుస్తక సంస్థ సభ్యురాలు. డోస్టోవిస్కీ, టాల్‌స్టాయ్, హమ్సున్, రాబె, విక్కీ బామ్‌ల నవలలు కలగా పులగంగా ఉండేవి. సెల్మాలాగర్లోఫ **(Sehna Lagerloaf)** రచన **'Gost a Berling'** అందుబాటులో ఉండేది. తర్వాత నేను పురపాలక

సంఘ గ్రంథాలయానికి వెళ్లినా మా అమ్మ పుస్తక సంచయం నాలో తొలి ప్రేరణలను నింపింది. మా అమ్మ నిక్కచ్చిగా ఉండే వ్యాపారస్థురాలు. అయినా ఎగవేసేవాళ్లకే అరువియ్యక తప్పేది కాదు. ఆమె గొప్ప సౌందర్యోపాసకురాలు. సంగీత రూపకాలను, ఏ కాంకికలను, మధుర గీతాలను రేడియోలో వింటూ ఉండేది. పనికొచ్చే లక్షణాలున్న నా కథల్ని వింటూ ఉండేది. పురపాలక సంఘ నాటకశాలకు తరచుగా వెళ్లేది. అప్పుడప్పుడు నన్ను కూడా తీసుకుపోయేది. నువ్వు రచయిత వెలాగయ్యావు? అని అడుగుతారు. అందుకే దశాబ్దాల కిందటి ఒక ఐతిహాసిక చాలనంతో నేను సృష్టించిన పాత్రల, చిత్రవర్ణకిమ్మీరిత దృశ్యాల వెనుక నుండే పెట్టే బూర్జువా దశకు చెందిన నా బాల్య స్మృతుల నన్నింటినీ ఇప్పుడు మీ ముందు నెమరు వేసుకుంటున్నాను. సుదీర్ఘ దివాస్వప్నాలను కనే సామర్థ్యం, ఏ మాటనైనా విరిచి వెంటాడే భాషా క్రీడ, నిజానికి కట్టుబడి ఉండే రోతను వదలి, నా కోసం కాకుండా ఎలా పోయేదాన్ని అలా వదలిపెట్టే వ్యసనం - ఈ పనివాడితనం అంతా అక్కడినుండి నేర్చినదే. కాని మా నిరాడంబర జీవితంలోకి హఠాత్తుగా రాజకీయాలు చొరబడి, ఆడంబరం నిండిన బరువుల్ని నింపి ఒక శాశ్వత గాంభీర్యాన్ని కూర్చాయి.

డాంజిగ్ నగరం స్వతంత్రంగా ఉన్నప్పుడు అక్కడి పోలండు దేశపు తపాలాశాఖలో మా అమ్మ పిన తండ్రి కొడుకు పనిచేసేవాడు. ఆయనంటే మా అమ్మకు ఎంతో ఇష్టం. ఆయన తరచుగా మా ఇంటికొచ్చేవాడు. యుద్ధం మొదలవగానే ఆమా మామయ్య సైన్యానికి పట్టుబడ్డాడు. ఇతరులతోపాటు ఆయనను విచారించి కాల్చి పారేసారు. తలవని తలంపుగా ఆయనపేరు ఎప్పటికీ వినబడకుండా పోయింది. ఆయన అనామకుడయ్యాడు. పదిహేనేళ్ల వయస్సులో నేను మిలటరీ దుస్తులు ధరించేను. పదహారోయేట నాకు భయమంటే ఏమిటో తెలిసింది. పదిహేడవ ఏట నేనొక అమెరికా యుద్ధ ఖైదీల కేంద్రంలో ఉన్నాను. పద్దెనిమిదో యేట నల్లబజార్లో ఉన్నాను. శిలా శిల్పాన్నభ్యసించేను. చిత్రకళాశాలలో చేరడానికి సంసిద్ధుడ నయ్యాను. ద్రుతగతిలో పద్యాలను, ఏకాంకికలను రాసేను తీసేను; రాసేను తీసేను. నా అంతరంగంలో ఒక సౌందర్య దాహం ఉన్నట్లు అప్పటికి తెలిసింది. అయితే ఈ దశ లన్నింటికిందా మా మామ అనే తొలగిచనిన మహాశిల కింది గులకరాళ్లు మిగిలే ఉన్నాయి. ఆ పోలెండు తపాలా ఉద్యోగి కాల్చివేతను, ఖనాన్ని కళ్లారా చూసిననేనొక్కణ్ణే ఆ కళేబరాన్ని తవ్వితలకెత్తుకుని, కృత్రిమ సాహిత్య శ్వాసను కల్పించి, ఎన్నో మారు పేర్లతో, మారు వేషాలలో పునరుజ్జీవింపజేసేను. ఇప్పుడా పని ఒకనవలలో కనిపించింది. ఈ నవలలో అనేక అధ్యాయాలున్నాయి. ప్రధాన, అప్రధాన పాత్ర లన్నింటిలోనూ జీవ చైతన్యం తొణికిస లాడుతూ ఉంటుంది. ''ఇంకా వుంది'' అనిపించే రచయితల నిరంతర వాగ్దానానికి కట్టుబడి పాఠకుణ్ణే చివరిదాకా నిలిపి ఉంచే నవల ఇది.

ఎప్పట్లాగే ''రేకుడబ్బా'' (Tin Drceme) గడ్డురోజులు (Dog Years) అనే నా తొలి నవలలతో పాటు ''పిల్లి - ఎలుక'' (Cat and Mouse) అనే నవలిక కూడా వెలువడింది. అప్పటికున్న వాళ్లలో నేను యువరచయితను. పుస్తకాలు వైరుధ్యాలను కల్పిస్తాయని, అసూయాద్వేషాలను, క్రోధకార్పణ్యాలను రెచ్చగొట్తాయని ఆరచనలు వెలువడ్డాకే నాకు తెలిసింది. మాతృదేశాన్ని ప్రేమిస్తూ రాయడం. స్వార్థగుణంగా కనబడింది. అప్పటి నుండి నేను వివాదాస్పదుణ్ణయ్యాను. సైబీరియాలో ప్రవాసశిక్ష అనుభవించే రచయితల కన్న నా స్థితి బాగానే ఉంది. అందుచేత ఎవరిమీదా నేరారోపణ చేసే అవకాశం నాకు లేదు. అయితే రచయితల రచనా వ్యాసంగంలో ఒక చిక్కు ఇమిడి వుంది. శాశ్వత వివాదాస్పదత్వమే ఆ చిక్కు. ఆ చిక్కు నెదుర్కొని రచయిత తన బలం పెంచుకోవాలి. రచయిత లెప్పుడూ తగిన

విచక్షణతో, మహదానందంగా, ఉన్నవాళ్ల నోట్లో మట్టికొడతారన్నది జీవనసత్యం. అంతకంతకూ పదునెక్కే సెన్సారు కత్తెరకు సమాంతరంగా సాహిత్య చరిత్రను నడిపే శక్తి అదే.

అధికార శక్తుల విరస ధోరణి సోక్రటీసు చేత విషం తాగించింది. ఓవిడ్‌ను ప్రవాసానికి పంపింది. సెనెకా మరణించేలా చేసింది. శతాబ్దాల కిందటి నుండి ఇప్పటి వరకు పాశ్చాత్య సాహిత్యోద్యానంలోని అమృతఫలాలు కేథలిక్ చర్చిలోని గుణ సూచికకు వన్నె తెచ్చాయి. నిరంకుశాధికారాలను చలాయించే రాకుమారులు అమలు చేసిన నిబంధనావళుల నుండి ఎంతటి తృణచ్ఛన్నకూసాల్లాంటి ప్రకటనలను నేర్చుకుంది? ఎంత మంది జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగీసు రచయితలు ఫాసిజాన్ని తమ నేల నుండి, భాషనుండి తరిమికొట్ట గలిగేరు? లెనిన్ - స్టాలిన్ల భయానక పరిపాలనకు ఎందరు రచయితలు బలి పశువులయ్యారు? చైనా, కెన్యా, క్రోసియా దేశాల రచయిత లిప్పుడెలాంటి ఒత్తిడులకు తలొగ్గుతున్నారు?

పుస్తకాలు తగులబెట్టే చోటు నుండి వచ్చాను నేను. ఈ రోజుల్లో కూడా ద్వేషానికి గురైన పుస్తకాన్ని తగుల బెట్టాలనే కోరిక మనచైతన్యంలో ఒక భాగంగా ఉంది. అవసరమైనప్పుడు పుస్తకం విద్యుదభివ్యక్తితో అసంఖ్యాక శ్రోతృగణాన్ని చేరుకుంటుంది. మత ఛాందసత్వంతో రచయితలను ఘోర శిక్షలకు - ఇంకా చెప్పాలంటే మరణ శిక్షలకు గురిచేసే హేయమైనస్థితి ఇప్పుడు లోకమంతట్లోనూ తలెత్తుతూంది. లోకం ఆ ఘాతుకాన్ని చూస్తూ ఊరుకోవడానికి అలవాటు పడిపోయింది కూడా. 1995లో నైజీరియాలో కెన్‌సారోవివా **(Ken Saro Wiva)** అనే రచయిత, అతని మద్దతుదారులు తమ దేశాన్ని కలుషితం చేసే విధానాలకు ఎదురు తిరిగినందుకు మరణ శిక్ష విధించి, అమలు చేస్తే స్వేచ్ఛా ప్రపంచంగా చెప్పుకునే భాగం కొంత పెడ బొబ్బలు పెట్టిన మాట నిజమే. తక్షణం పరిస్థితి ప్రశాంతంగా మారింది. ప్రకృతిసమతులన సంబంధమైన జాగ్రత్తలు ప్రపంచపు ప్రప్రథమ శిలాతైల ఉత్పాదక దేశపు లాభాలకు అడ్డుతగలడమే ఇందుకు కారణం.

మతం, రాజ్యం, రాజకీయ సంఘం, ప్రసార సాధనాలు పుస్తకాలను రచయితలను చూసి ఎందుకిలా భయపడుతున్నాయి? ఎందుకింతలా వ్యతిరేకిస్తున్నాయి? పాలక పక్ష విధానాలను సూటిగా ఎదుర్కొనేవాళ్ల నోరైనా నొక్కుతారు - పీకైనా పిసుకుతారు. తరచుగా ఇదంతా సత్యం ఎప్పుడూ బాహుళకంగానే ఉంటుందన్న సాహితీ వ్యంజన సూత్రాన్ని చెప్తూంది. శుద్ధసత్యమంటూ ఏదీ లేదని బహుళసత్యాలు మాత్రమే ఉంటాయని చెప్తూంది. ఇదో అదో ఏదో ఒకటే సత్యమని నమ్మి దాని కొమ్ము కాసేవాళ్లకోసం అపాయమో, ప్రాణహానో పొంచి ఉంటుంది. ఇక్కడొక సమస్య వుంది. గతాన్ని నిద్రపోనీయని వాడే రచయిత. ఐర్లండు బాలకులను 'ఉడికించి - వేచి - ఇగిర్చి - మరిగించిన' ఇంగ్లండులోని ఉన్నత వర్గాల వంటగదులను జొనాథన్‌స్విఫ్ట్ కళ్లగొట్టించాడు. రచయితలు గాయాలమీది పక్కులన్నింటినీ ఊడదీస్తారు. తలుపు కన్నాల్లోంచి కళ్లు చిట్లించి చూస్తారు. కవాటాల వెనుకనున్న కంకాళాలను కనుక్కుంటారు. కామధేనువుల్ని కబళిస్తారు. వాళ్లకు పవిత్రమైనదంటూ ఏమీలేదు. వాళ్లను తిరుగుబాటు దారుల్ని, నేరస్థుల్ని చేసిన పెట్టుబడిదారీ వ్యవస్థను సైతం వాళ్లు వదలిపెట్టరు. అన్నిటికీ మించిన ఇబ్బందేమిటంటే చరిత్రలో విజేతలుగా పేరు పడ్డవారితో పాలుపంచుకోవడాన్ని వారు వ్యతిరేకిస్తారు. వెక్కి వెక్కి రోదించడానికి కొకవేదికంటూ దొరకని పరాజితులతో చరిత్రగతికి పసిడి జల్తారు లేసు అల్లడం వాళ్లకు ఆనందాన్నిస్తుంది. వాళ్లకోగొంతు నిచ్చి విజేతల్ని వెనక్కి పిల్చి నిలదీస్తారు. వాళ్లతో చెయ్యి కలుపుతారు. వాళ్లతో బుజాలు రాసుకుంటారు.

ఏ కాలంలోనైనా, ఏ వేషంలోనైనా అధికారాలు సాహిత్యాన్ని వ్యతిరేకించింది లేదు. దాన్నొక ఆభరణంగా అలంకరించుకుని పోషించాయి. అధికారవర్గం ఇప్పుడు లోకంలోని ఋణపక్షాన్ని

బులబులాగ్గా చెప్తూ ప్రజలకు చీకట్లో ఆశాకిరణాలను చూపించే విదూషక సంస్కృతిని ఆదరించే పాత్రను పోషిస్తూంది. అనుకూల నాయకుల యుగం ఇప్పుడు నడుస్తూంది. స్వేచ్ఛా విపణి అనే ఆర్థికారణ్యంలో శవాల మధ్య తోవ చేసుకుంటూ చిరునవ్వుతో రాంబోలాగా నడుస్తాడిప్పటి నాయకుడు. యుద్ధాలలో మెరుపు దెబ్బ తీసేవాడే ఇప్పుడు నాయకుడు - పరాజితుల పరంపరను అధిగమించే విజేత. ప్రపంచీకరణకు నికరమైన నమూనా. ధర బాగా పలుకుతూన్నవాడు.

ప్రసారమాధ్యమాలతని పాద పీఠిక నాశ్రయిస్తాయి. జేమ్స్‌బాండ్ డాలీవంటి పిల్లలనెందర్నో ప్రసవించేడు. అతని ధీరగమనం కొనసాగినంతకాలం దౌష్ట్యానికి వ్యతిరేకంగా ప్రజాసహమతి కొనసాగుతూనే ఉంటుంది.

అంతటితో అతని ప్రతికక్షి ప్రతినాయకుడు కావాలా? అక్కరలేదు. పతితుల్ని, భ్రష్టుల్ని నాయకులుగా వరించిన స్పెయిన్, మూర్ సంప్రదాయపు నవలలో నా మూలాలున్నాయి. యుగయుగాలుగా ఆ సంప్రదాయంలో గాలి మరల ముందు ఊగులాడడం ఒక నమూనాగా నిలిచి వుంది. ఓటమిలోని విదూషక ప్రవృత్తి నుండి పతితుడి నిలకడ మొలకలెత్తింది. లొత్తపడేలా చేయలేనని తెలిసి కూడా అతడు అధికార స్తంభాలమీద అల్పాచమానం చేస్తాడు; సింహాసనానికి రంపపు కోత పెట్టాడు. ఒకసారి అతడు కదిల్తే ఆలయశిఖరం మసకబారినట్లు కనిపించవచ్చును; అధికార పీఠం కొంచెం కదిలినట్లనిపించవచ్చును. అతడి వినోదమంతా అతడి నిరాశలోని పేగే. అతడి నాటకశాలలో మోద విషాదాలు చెట్టపట్టాలు కట్టుకొని నడుస్తాయి. విజేతల నిశ్చిత గమనం పట్ల విముఖతతో అతడు వాళ్ల కాళ్లలో మండి కొడతాడు. అక్కడా అతని ఓటమి మనకు నవ్వు పుట్టిస్తుంది. ఆ నవ్వు మన గొంతులో అడ్డు పడుతుంది. అతడి చమత్కార భరితమైన నైరాశ్యాలలో కూడా విషాద చ్ఛాయలు పరుచుకుని ఉంటాయి. ఇంతచేసీ బర్బర - దక్షిణ పక్ష - వామపక్షవాదులందరి దృష్టిలో అతడు ప్రథమ శ్రేణి మతానుయాయి, మార్గగామి. అతడు తన చిన్న దూరదర్శినిని వ్యత్యస్తంగా పట్టుకుంటాడు. కాలం అతడికి ముందు వెనుక లాడడానికి పట్టాలు మారేరైలు బండిలా కనిపిస్తుంది. అతడెక్కడ పడితే అక్కడ అద్దాలు అమరుస్తాడు. అతడెవరికి అనుకర్తో మీ రెప్పటికీ చెప్పలేరు. అతడు తన యాత్రిక బృందంలో మరుగుజ్జుల్ని, ఆజానుబాహుల్ని సైతం చేర్చుకుంటాడు. విదూషకులు వ్యక్తం చేసే హాస్యం నరకసదృశమైనది. వ్యంగ్యం నా మెదడులో ఉన్న కళారూపం వ్యంగ్యానికి గురికాని విషయముండదు.

1973 మే 2వ తేదీన ఇక్కడ నోబెల్ ఉపన్యాసాన్నిచ్చిన హెన్రీ బోల్ (Heinrich Boll) హేతువు - కవిత్వం అనే పరస్పర విరుద్ధంగా కనిపించే స్థానాలను మరీ మరీ దగ్గరయ్యేలా చూపించి దానికి సంబంధించిన ఇంకొక అంశాన్ని వివరించడానికి సమయం లేదని విచారించేడు. ''పిన్న పెద్ద అనే అంతరాలు లేని హాస్యాన్ని గూర్చి నేను చెప్పాలి. నిరోధించడానికి మాటుకట్టే హాస్యం అతడి కవిత్వంలో నిర్లక్ష్యానికి గురి అయింది''. ఈ ప్రశ్నకు గురియైన జీన్‌పాల్, తగినంత మంది పాఠకులు లేకపోయినా, జర్మనీ సాంస్కృతిక వైభవ భవనంలో స్థానం సంపాదించేడు. థామస్ మాన్ సాహిత్య కృషిని ఆ సమయంలోని అధిక్షేపంగా వామ - వామేతర పక్షాలు సందేహించాయి. బోల్ మనసులో ఉన్నది కడుపుబ్బ నవ్వించే హాస్యం కాదు. హద్దు మీరని, సున్నితమైన, నిశ్శబ్ద హాస్యం మాత్రమే. విదూషకుడి విషాదానికి నిరంతరంగా లొంగిపోయిన హాస్యం. మౌనాన్ని మూటగట్టుకున్న మనిషిలోని తెగువ నిండిన చతురు. ప్రసార మాధ్యమానికి పరిపూర్ణత నిచ్చే చర్య. స్వచ్ఛంద స్వయం నియంత్రణ కొంక ఆహార్యం. నియంత్రణ నిబంధనలపై కప్పిన మేలిముసుగు.

నేను రచనలు ప్రారంభించిన ఏభయ్యవ దశకంలో హెన్రీ బోల్ ప్రసిద్ధుడైన రచయిత. ఉల్ఫ్ గ్యాంగ్ క్యోప్టెన్, గుంటర్ ఈక్, ఆర్నో స్మిడ్ట్‌లతో కలిసి సాంస్కృతిక కార్ఖానాకు దూరంగా నిలచాడు.

నాజీ పరిపాలనలో కలుషితుడైన జర్మనుదేశీయునితో యుద్ధానంతర జర్మను సాహిత్యం గడ్డుదశలో పడింది. ''ఆస్విట్జ్ (Auschwitz) తర్వాత పద్యం రాయడం అనాగరిక చర్య అయింది. అందుకే ఈనాడు పద్యం రాయడం అసాధ్యమయింది.'' అంటూ థియోడార్ అడార్నో విధించిన నిషేధం కొంతవరకు బోల్ తరానికి, నావంటి యువరచయితల లక్ష్యానికి మధ్య నిలిచింది.

ఇంకోలా చెప్పాలంటే'' ఇంకావుంది'' అన్నమాట ఇంకలేదు. మేము రాస్తున్నా అంతే. అడార్నోలాగే నాగరకతా చరిత్రలో అనుసంధానం చేయడానికి వీలుకాని అస్విట్జ్ గుర్తించిన చీలికను ఊహల్లో నిలుపుకుని రాసేము. నిషేధం చుట్టూ పరిభ్రమించడానికి మాకు దొరికిన ఆశ అదే. అయినప్పటికీ అడార్నో శిలాశాసనం ఇప్పటికీ తన శక్తిని నిలుపుకునే వుంది. నాతరం రచయితలందరూ దానితో దొమ్మీ యుద్ధం చేసేరు. నోరు మెదపకుండా ఉండాలనే కోరికగాని, నిబ్బరంగాని ఎవడికీ లేవు. జర్మను దేశీయుణ్ణి నిటారుగా నడిపించడం మావిధి అయింది. బాల్యదశలోనే చేతులు కాల్చుకున్న మేమంతా నియంతలను తిరస్కరించడానికి ఒక తాటిమీద నిలిచేము. సందేహం, అవిశ్వాసం మా దైవాలు. తలనెరసిన విలువల వెల్లువ వాళ్ళు మాకిచ్చిన కానుక. ఇంతవరకు నిరాటంకంగా తప్పుడు ఉచ్చారణ చేసిన నా భాష గొప్పతనాన్ని తెలుసుకోవడానికి ముందుగా నాపై నేను కఠోర నిబంధనలను విధించుకున్నాను. దాని ప్రలోభ పెట్టే మృదుత్వాన్ని లోతుల్ని తరచి చూచే వైఖరిని, మైనంలా వంగే దాని బింకాన్ని, దాని మాండలికాల తళుకుల్ని, దాని నిరలంకార - సాలంకార సౌందర్యాన్ని, దాని వైలక్షణ్యాలను, దాని అభివ్యక్తుల నుండి ఉద్భవించే ఒక సౌందర్య వికసనాన్ని తెలుసుకునే దాకా నాకు నేను దూరంగా ఉన్నాను. ఈ మూలధనాన్ని గెలుచుకున్న తర్వాత దానిని ఇతోధికంగా పెంచుకునే పెట్టుబడులు పెట్టేము. పద్యమైనా, వచనమైనా ఆస్విట్జ్ తర్వాత ఒక జ్ఞాపకంగా మారడం, గతాన్ని ముగిసిపోనీకుండా అడ్డుపడడం అనే తోవలోనే నడచింది. అప్పుడు మాత్రమే యుద్ధానంతర జర్మను సాహిత్యం ''ఇంకావుంది'' అనే సార్వత్రికమైన చెల్లుబాటును తనకు, తనసంతతికి అన్వయించుకోవడంలో న్యాయం చేయగలదు. అప్పుడేగాయాలు తిరిగి సెలవేయడం ప్రారంభిస్తాయి. అప్పుడే మనం ఎంతగానో కోరుకున్న, నిర్ణయించిన 'మార్పు' అనేలక్షణం ''అనగా అనగా ఒకప్పుడు'' తో మొక్కవోకుండా విలోమదిశా పునరభియానం కొనసాగిస్తుంది.

ఎన్నోసార్లు, ఎవరో ఒకరి అభీష్టానికనుగుణంగా మనం సిగ్గుతో తలదించుకోవలసినగతాన్ని ముగిసిన అధ్యాయంగా విస్మరించి సాధారణ స్థితికి తిరిగివచ్చిన అవసరాలేర్పడ్డాయి. ఎన్నోసార్లు సాహిత్యం ఆ ప్రయత్నాన్ని నిరోధించింది. ఆ నిరోధమే సరియైనది. విస్మృతి అనే స్థితి ఎంత అర్థవంతమైనదో అంత అర్థహీనమైనది. ఎందుచేతనంటే జర్మనీలో ఎప్పటికప్పుడు యుద్ధానంతర స్థితి ప్రకటిత మవుతూంది. పదేళ్ల కిందట రెండు జర్మనీల మధ్య గోడను కూల్చి ఏకీకరణను సాధించినప్పటి స్థితి అలాంటిదే. గతం మనను పట్టుకుని వేలాడుతూంది.

ఆ సమయంలో 1920 ఫిబ్రవరిలో ఫ్రాంక్ఫర్ట్లోని విద్యార్థుల నుద్దేశించి నేను ''ఆస్విట్జ్ అనంతర రచన'' అనే ప్రసంగం చేసేను. నా రచనలో ఒక్కొక్క పుస్తకాన్ని పరీక్షించుకోవాలనుకున్నాను. 1972 లో రాసిన ''నత్తగుల్ల దినచర్య'' (Dairy of a Snail) అనే పుస్తకంలో గతం వర్తమానం ఒకదాన్నొకటి వెనక్కి తోసుకుంటూ, గుద్దుకుంటూ, సమాంతరంగా సాగుతూ ఉంటాయి. నా కుమారులు నా వృత్తిని నిర్వచించమని అడిగేరు. ''పిల్లలూ! కాలప్రవాహాని కెదురీది రచనచేసేవాడే నిజమైన రచయిత'' అనినేను సమాధానం చెప్పేను. విద్యార్థులకు నేనిలా చెప్పేను ''రచయితలు ఏకాంత దంతహర్మ్యాలలో బాధితులు కారని ఊహించుకునే దృష్టి ఒకటుంది. వాళ్లు ఇప్పుడు - ఇక్కడ - జీవిస్తున్నట్లు తమకుతాము అనుకుంటూ వుంటారు. కాలంలోని మార్పులను బట్టి వాళ్లు తమను తాము వెల్లడి చేసుకుంటారు. కాల ప్రవాహంలోకి దూకి ఏదో ఒక ఒడ్డును పట్టుకుంటారు. ఈ దూకడం, ఏదో

ఒక ఒడ్డును పట్టుకోవడం అందరికీ బాగా తెలిసినవే. రచయిత పాటించవలసిన ఎడం బెదిరింపుకు లోనయింది. అతని భాష జీవనోపాధికి పరిమితం కావలసి వచ్చింది. సమకాలీన సంఘటనల సంకుచితత్వం అతడిని సంకుచితుణ్ణి చేసింది. పరుగులు తీసే ఊహలకు పగ్గాలు వేసింది. ప్రాణభీతి అనే అపాయం నుండి అతడు పరుగులు తీసేడు''.

అప్పుడు నేను సూచించిన గండం నా రచనా జీవితమంతా ఎదురవుతూనే ఉంది. కాని గండాన్ని తప్పించుకునే రచయిత వృత్తి ఏమవుతుంది? రచయితకు భద్రత కావాలని అనుకుంటే, అతడొక సాంస్కృతి కాధికారిగానే ఉండాలనుకుంటే అతడు వర్తమానపు మురికిలో కాళ్ళూ చేతులూ తన్నుకుంటూ తన భయాలకు తాను బందీగా ఉంటాడు. ఎడం తొలగిపోతుందనే భయంతో ఆ రచయిత పుక్కిటి పురాణాల పరిధిలో, ఊహా విహంగాల మధ్య ఆశ్రయం పొందుతాడు. కాని చిట్టచివరకు గతమే పరిభ్రమణరూపంలో వర్తమానమై అతడి పిలక పట్టుకుని కఠోర పరీక్షలకు గురి చేస్తుంది. బాగా ముందుగానో, బాగా ఆలస్యంగానో పుట్టినందుకు నిరసన వ్యక్తం చేస్తూ ఉంటారు రచయితలు. అసంగతలా ఉంచితే ప్రతి రచయితా తాను పుట్టిన కాలాన్ని కాదనలేడు. ఏం రాయాలి - అనే విషయంలో అతడికి స్వయం ప్రతిపత్తి లేదు; అది ముందే ఎంపికై ఉంటుంది. కనీసం నాకలా ఎంచుకునే స్వేచ్ఛలేదు. నామానాన నన్ను వదిలేస్తే నేను కూడా సౌందర్య సూత్రాల బాటన నడచి ప్రమాదరహితమైన - ప్రహసన ప్రాయాలైన పాఠ్యగ్రంథాల్లో నా స్థానాన్ని పదిలం చేసుకుని మహా సుఖంగా ఉండేవాణ్ణి.

కాని అలా ఉండకూడదు. తప్పును సమర్థించుకునే పరిస్థితులక్కడున్నాయి. జర్మనీ చరిత్రలో శిథిలాలు, శవాలు గుట్టలు గుట్టలుగా పడి వున్నాయి. నేను తవ్వి పోస్తూన్న కొద్దీ అవి తామరతంపరగా వృద్ధి పొందుతున్నాయి. అది తేలికగా తీసిపారెయ్యదగినది కాదు. అదలాగుంచి - నేనొక ప్రవాసుల కుటుంబం నుండి వచ్చిన వాణ్ణి. రచయితలైన వాళ్లను రచన నుండి రచనకు తరిమే సాధారణ వాంఛ, విసుగుదల వలన భయము, ఆత్మైక పరాయణత్వ మార్గాలకు తోడు మాతృభూమిని పోగొట్టుకున్న పూడ్చడానికి వీలుకాని నష్టమొకటి నన్ను పొదువు కుంది . కట్టుకథ అల్లుతూ కూర్చుంటే నేను పోగొట్టుకున్న శిథిల నగరాన్ని తిరిగి ఆక్రమించుకోలేను, కనీసం నా ఊహల్లోంచి దాన్ని పునర్నిర్మించ గలగాలి. ఆ మానసిక భీతి నన్ను ముందుకు నడపించింది. మనం పోగొట్టుకున్నది విస్మృతిలో మునిగిపోవలసిన అవసరం లేదని నాకు, నా పాఠకులకు స్పష్టం చేయదలచుకున్నాను. దేవాలయాలు, శ్మశానాలు, నౌకాశ్రయాల రణగొణ ధ్వనులు, తపతపలాడే బాల్టిక్ జలాల వాసనలు, వెచ్చగా హెచ్చుగా ఇప్పటికీ తన తోవలో తాను కొనసాగే భాష, పశ్చాత్తాప పడవలసిన పాపాలు, ఎన్నటికీ తేటతెల్లం కాకపోయినా ఓర్చుకున్న నేరాలు - ఇవన్నీ సాహిత్య కళలోని ఉన్నతి - సూక్ష్మతలలో పునర్భవం పొందవచ్చును. ఇలాంటి నష్టమే ఏదో ఒకటి ఇతర రచయితలను కూడా మానసిక భీ తి నిండిన వస్తువులనే వేడెక్కిన గెత్తపు నేలల్లో నిలుపుతుంది. కొన్నేళ్ల కిందట సాలమన్ రష్డీకి నాకు మధ్య నడచిన సంభాషణలో అతడు పోగొట్టుకున్న బొంబాయి అతడికెలాంటిదో, నేను పోగొట్టుకున్న డాంజిగ్ నా కలాంటిదని ఒప్పుకున్నాము. మా ఆధార భూములు అవే, ప్రవాస బిలాలు అవే. మా కదలికల క్షేత్రాలవి. ప్రపంచం కడుపులో తిప్పులవి. ఈ తల బిరుసుతనం, ఈ వల్ల మాలిన విధ్వంసం సాహిత్య హృదయంలో నిలిచి ఉన్నాయి. నిలిచిపోయిన వాటి నన్నింటినీ వెలికిలాగే కథకుండే పరిస్థితి ఇది. శ్రమ కలిగించే వివరాలు, సున్నితమైన మనస్తత్వ నిరూపణ, జీవన వాస్తవికతా శకలాలు ఈ శిల్ప సూత్రాలేవీ మా భయానక ముడి పదార్థాలను నిర్వహించలేవు. హేతుమూలకమైన ఉల్లాసకర సంప్రదాయానికి ఎంతగానో మేము ఋణపడ్డాము. హేతు రహితమైన చరిత్రగతి పరిపూర్ణ హేతు మూలకాలైన వివరణల నన్నింటినీ మథిస్తుంది.

నోబెల్ బహుమతి లాగే ఒకసారి మనం దాని పండగ బట్టల్ని తొలగించి చూస్తే డైనమేట్‌ను కనుక్కోవడానికి మూలాలు అక్కడ కనిపిస్తాయి. అసంఖ్యాక మానవాళి శీర్షోదయాల లాగే అణువిచ్ఛేదం, జన్యుకణాల ఉదాత్త వర్గీకరణ కూడా ప్రపంచంలో కలిమిలేముల్ని నలగ్గొట్టి మూసకట్టించేయి. కాబట్టి సాహిత్యపు మూలంలో ఒక విధ్వంసక శక్తి ఉంది. సాహిత్యాణువుల విధ్వంసక శక్తి తాపీగా కాలం భూతద్దం వెనుక నిలిచి చూసినప్పుడు మాత్రమే దాని ఫలితము, పరిణామము కనిపిస్తాయి. నిజం చెప్పాలంటే సుఖ దుఃఖానుభవాలు రెండింటికీ అది కూడా ఒక అభివ్యక్తి కారణమే. మధ్య యుగాల వేదాంత ధోరణి అనే చీకటి కోణాలలోకి హేతువాదపు ఆశాకిరణాలను చొప్పించడానికి మాంటేగు నుండి డిడెరాట్, కాంట్, వెస్సింగ్, లిఖెన్‌బర్గ్‌ల దాకా ఐరోపా ప్రగతి వాదాన్ని సాధించడానికి ఎంతకాలం పట్టింది? అధికార నిబంధనల సరళి నుండి దానిని వెంటాడి నిరోధించగా ఆ ఆశాకిరణం సైతం అప్పుడప్పుడు అంతరించిపోయేది. కాని చిట్టచివరకు ఆ ఆశాకిరణం ప్రజ్వలించి వస్తుజగత్తును వెలికితీసినప్పుడు అది కుతర్కపు వెలుగుగా మారిపోయింది. ప్రగతి కాముకులంతా చాటింపు కొట్టుకున్న హేతువు - హేతుమూలకమైన కొరుకుడు పడని భాషలో బాజాకొట్టి పెట్టుబడిదారీ - సామ్యవాద ధోరణులనే పిల్లలను పెట్టింది.

మేధో జనితాలైన ఆ మహత్తర దోషాలన్నీ ఎలా చివికి చూర్ణదశకు చేరుకున్నాయో నేడు మనం చూస్తున్నాము. మాటల మందుగుండు దట్టించి మన మీదకు విసిరిన ఆ విస్ఫోటక శక్తులు ఎలాంటి విపత్కర పరిస్థితిని సృష్టించాయో మనం చూస్తున్నాము. ఆ నష్టాన్ని తిరిగి మేధోపకరణాలతోనే చక్కదిద్దాలని ప్రయత్నిస్తున్నాము. అంతకు మించిన సాధనాలేవీ మన దగ్గర లేవు. సామ్యవాదం దాదాపుగా అంతరించిపోయినట్లుగా కనిపిస్తుంది. దానిలోని లోపాలను చర్విత చర్వణంగా వల్లెవేస్తూ పెట్టుబడి దారీ వ్యవస్థ భయానకంగా తయారయింది. అడ్డూ, అపూ లేకుండా తన శక్తిని గూర్చి ఉన్మత్తంగా ఊదరగొడ్తూ స్వేచ్ఛావిపణినదొక పిడివాదంగా మార్చింది. అలవిమీరిన బలంతో మత్తెక్కిపోయి విశృంఖల ఖేలలన్నింటినీ ప్రదర్శిస్తూంది. అమితలాభార్జన అనే ఏకైక లక్ష్యంతో ఒకదాని వెనుక ఒకటిగా అన్నింటినీ తనలో కలుపుకుంటూంది. పెట్టుబడి దారీ తనం సంస్కరణకు లొంగకుండా ఉంది. సామ్యవాదం తనకు తానే ఉరిపోసుకుంది. ప్రపంచీకరణం దాని ఆదర్శవాక్యం. అది దోష దూరమైన దన్న బింకంతో ప్రకటించబడిన వాక్యం. అంతకుమించి గత్యంతరం లేదు.

అందుచేత చరిత్ర ముగింపుకు చేరుకుంది. ''ఇంకావుంది...'' అన్న కౌతుక మిప్పుడు లేదు. రాజకీయం తన నిర్ణాయక శక్తిని ఆర్థిక శాస్త్రానికి ధారపోసింది. ఇప్పుడొక కొత్త పిడివాదాన్ని ముందకు నెట్టడానికి కనీసం సాహిత్యమైనా నడుం కట్టగలదన్న ఆశ ఒకటి ఇంకా మిగిలింది.

ధ్వంస రచనలో విస్ఫోటకశక్తి - సాహిత్య ప్రమాణాలు అనే రెండు గుణాలెలా సిద్ధిస్తాయి? ఇంకా ఎప్పుడో ఏదో చేస్తామని మీనమేషాలు లెక్కపెడుతూ కూర్చునే వీలుందా? భవిష్యత్తు అందించేటంత తక్షణ వేగంతో ఏ సరుకునైనా అందించే సామర్థ్యం ఏ పుస్తకానికైనా ఉందా? యువ రచయితలు ఇంటర్నెట్‌ను తమ క్రీడాంగణంగా ఎంచుకున్న ఈ రోజుల్లో సాహిత్యం ప్రజా జీవితం నుండి వెను దిరిగి పోవడం లేదా? ''ప్రసారము'' అనే సందిగ్ధ పదమొకటి ఇప్పుడు తన చుట్టూ గుడికట్టుకొని నిల్చుని, మంచి చలామణిలో వుంది. నరాలు చచ్చుబడిపోయే చివరి దశవరకు కాలపు ప్రతిలిప్త సంసిద్ధం చేయబడింది. కన్నీటిలోయల సాంస్కృతిక కర్మాగారమొకటి లోకపు బాధ్యత చేపట్టింది. ఇప్పుడేమి చేయాలి?

నా నిరీశ్వరవాదం నిలదొక్కుకోలేకపోతూంది. విషమ సమస్యలు కొన్నింటిని పరిష్కరిస్తూ, నాకెప్పుడూ ఆశాభంగం కలిగించని ఒక స్వామి ముందు మోకరిల్లడమొక్కటే నాకు శరణ్య మిప్పుడు.

'' ఓ పవిత్రోదార శిశిఫస్! ఆ మహాశిల శిఖరాగ్రంపై నిలువకుండుగాక. ఉందని దాన్ని మేము మళ్లీ కిందకు దొర్లించాలి. అందులో నీలాగే నిరంతరానందం పొందాలి. దుర్భరమైన మా ఉనికికి అంతంలేదని చరిత్రకు చెప్పాలి. శుభం!'' అని కామూ **(Camus)** సౌజన్యంతో పలకాలి.

కాని నా మొర వినిపిస్తుందా? గాలివార్తలే నిజమా? అసంపర్క జీవుల నూతన జాతి ఒకటి మానవ చరిత్రను కొనసాగించే భరోసా ఇవ్వడానికి పుట్టుకొస్తుందా?

ఘట్టకుటీ ప్రభాత న్యాయంగా నేను మళ్లీ మొదటికొచ్చేను. మళ్లీ ''ఎలుక''లోని ఐదవ అధ్యాయాన్ని తెరుస్తాను. పరిశోధన కోసం ఉపయోగించబడ్డ ఆ ప్రయోగశాల ఎలుక లక్షలాది ఇతర ప్రయోగశాల జంతువుల ప్రతినిధి . దానికి నోబెల్ బహుమానం లభించింది. మానవాళిమీద కొరడా ఝులిపించే ఆకలి నుండి ప్రపంచానికి కలిపించగల ప్రణాళికలకు కూడా కొద్ది బహుమతులు ఎలా లభిస్తాయో నాకు గుర్తు చేయబడింది. డబ్బున్నవాడెవడైనా రెండు కాలేయాలు కొనుక్కోగలడు. గుండెలు మార్పిడి చేయవచ్చును. తీగ లేకుండా లోకంలో ఏ మారు మూలకైనా దూరవాణిని వినిపించవచ్చును. ఉపగ్రహాలు - అంతరిక్ష కేంద్రాలు మనను పదిలంగా గ్రహాంతర కక్ష్యలలో నిలుపగలవు. బహుమతుల్ని గెలుచుకునే పరిశోధన స్థాయిలో అత్యాధునిక ఆయుధాలెన్నో కనిపెట్టడం - శక్తివంతం చేయడంతో శాస్త్రజ్ఞులు మరణాన్ని ఒడ్డునకట్టి ఉంచుతున్నారు. అబ్బురమైన విధానాలను కనిపెట్టూ మానవ మేధ పురోగమిస్తూంది. ఆకలి ఒక్కటే దాన్ని అడ్డుకుంటూంది. అది దినదిన ప్రవర్ధమాన మౌతూంది. వేళ్లు తన్నుకుపోయిన దారిద్ర్యం దురదృష్టంమ్మీద నీడలు కమ్ముతూంది. ఆకల్ని తోడు తీసుకుని ప్రవాసులు ప్రపంచం మీద గుమి గూడుతున్నారు. పెచ్చు పెరిగిన ఈ దారిద్ర్యాన్ని రూపు మాపడానికి వైజ్ఞానిక ప్రగతి - రాజకీయ సహమతి జతకట్టాలి. కాని అందుకు నడుం కట్టిన వాడొక్కడూ కనబడటం లేదు.

1973లో చిలీని అమెరికా మద్దతుతో భయానకస్థితి ఆవరించినప్పుడు మొదటి జర్మన్ ఛాన్సలర్ విల్లీ బ్రాండ్ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఆ విషయాన్ని గూర్చి మాట్లాడేడు. ప్రపంచ వ్యాప్తమైన దారిద్ర్య సమస్యను లేవనెత్తేడాయన. ''ఆకలి కూడా యుద్ధమే'' అన్న ఆయన ప్రకటనకు ప్రతిస్పందనగా లభించిన ప్రతి స్పందనగా వినవచ్చిన కరతాళధ్వని అద్భుతమైనది.

ఆయన ఉపన్యసిస్తూన్నప్పుడు నేనక్కడ ఉన్నాను. అప్పుడు నేను ''పరిగ'' **(The Flounder)** అన్న నవలను రాస్తున్నాను. అన్నం లేకపోవడం - ఎక్కువైపోవడం, తిండిపోతులు - ఆకలితో నకనకలాడే వాళ్లు, ఉన్నవాళ్ల భోజనం పీటల మీంచి వినవచ్చే లొట్టల వంటి మానవుని ఉనికికి పునాదులైన విషయాలు ఆ నవలలో ఉన్నాయి.

ఈ సమస్య ఇంకా మిగిలే ఉంది. ధనవంతులు డబ్బును పెంచుకుంటూ ఉంటే దరిద్రులు జనాభాను పెంచుకుంటున్నారు. భద్రతా కాంశ్యకుడ్యాలలో ఉత్తర - పశ్చిమ దేశాలవారు తమను తాము దాచుకోవాలనుకొంటున్నారు. కాని ప్రవాసులు తండోపతండాలుగా వారి మీద విరుచుకుపడతారు. ఆకలి వెల్లువ అవరోధాల నన్నింటినీ ముంచెత్తుతుంది.

దీనంతటిని గూర్చి భవిష్యత్తు ఏదో ఒకటి చెప్పి తీరుతుంది. మన సాధారణ నవల మాత్రం కొనసాగించి తీరాలి. ఏదో ఒక రోజు ప్రజలు రాయడం, ప్రచురించడం మానినా, మానుకొనేలా చేసినా, పుస్తక మన్నదే దొరకకుండా పోయినా కథకులకు మాత్రం కొరత ఉండదు. గొంతెత్తి గొంతు విప్పి? కొంటె ప్రశ్నలు వేస్తూ - గుక్క తిప్పుకుంటూ నవ్వుతూ - ఏడుస్తూ చెవిలో నోరుపెట్టి కృతకశ్వాసను కల్పించే కథకులు ఎన్నటికీ ఉంటూనే ఉంటారు.

# మహాభారతమూ - రామాయణమూ

మూలం : డా॥ ఇరావతీ కర్వే                    అనువాదం : డా॥ పెదపాటి నాగేశ్వరరావు

(గతసంచిక తరువాయి)

ఒకసారి నీవు కౌసల్యని అవహేళన చేశావు. అది ఆమె మర్చిపోతుందా! రాజమాత ఐన తర్వాత ఆమె నిన్ను వదుల్తుందా? నీవు ఆమెకు దాసీగా ఉండాల్సి వస్తుంది. రామునిప్రక్క అందరూ దాసదాసీజనంతో ఆనందిస్తే నీ కోడలు బాధపడదా? (2.8.5) అని పరిపరివిధాలుగా కైకేయి మనస్సులో దుమారం లేపగలిగింది. దశరథుడు కైకేయికి యిచ్చిన రెండు వరాల సంగతి జ్ఞాపకం చేసింది. ముందు ఎలా వాటిని ఉపయోగించుకోవాలో కూడా సూచించింది.

నిజానికి రాజు వరాలిచ్చాడా! తెలియదు. కైకేయి అలిగింది చూసి బుజ్జగించాడు. ఏమడిగినా యిస్తానని శపథం చేశాడు. అలా చేసిన తర్వాత ఆమె రెండు వరాలు అడిగింది. అవి తప్ప ఇంకేమైనా అడగమన్నాడు. చివరికి దుఃఖంతో ఆమె కాళ్ళమీద కూడా పడ్డాడు. అప్పుడామె శపథం సంగతి చెప్పింది. వంశం యొక్క సత్యవాక్కు పరిపాలనా ప్రతిష్ఠ పోతుందని హెచ్చరించింది. పూర్వపు వరాల ప్రస్తావన లేదు. కేవలం శపథం నెరవేర్చమంది. కరిష్యామితవప్రీతిం సుకృతేనాపితేశపే (2 10 - 19.) అంటూ కైకేయి మాటకు సరేనని దశరథుడు స్పృహతప్పి పడిపోయాడు. తేరుకున్న తరువాత సుమంతుని పిలిచి రాముని పిలుచుకు రమ్మన్నాడు. (2-13-21) రాజాజ్ఞకు సరేనని రాముడ్ని తేబోయాడు (2-13-22) రాముడొచ్చాడు. అప్పుడు దశరథుడు ఏడుస్తున్నాడు. ఏదో చెప్పబోయాడు. గొంతు పెకలలే!

శోకతప్తుడైన తండ్రిని చూసి రాముడాశ్చర్యంలో మునిగిపోయాడు. కోపంలో ఉన్నప్పుడు కూడా తన్ను చూసి కరిగిపోయే తండ్రినేడు పాదాభివందనం చేస్తున్నా ఏమీ పలకలేదే! నేనేం తప్పు చేశాను? కైకనడిగాడు. అమ్మా - నేనేం తప్పుచేశానని రాజు ఇలా సంతాపంలో ఉన్నాడు. రాజు ఏది చేయమంటే అది చేస్తాను ఇది నా ప్రతిజ్ఞ. రాము డెప్పుడు రెండుగా మాట్లాడడు. అప్పుడు కైక వరాల సంగతి చెప్పి ఇలా అంది. నీవు నీ తండ్రి సత్య ప్రతిజ్ఞను నిలబెట్టాలంటే నేటికి నేడే పద్నాలుగేళ్ళు అరణ్యవాసానికెళ్ళు, భరతునికి అభిషేకం జరుగుతుంది. అనగానే రాముడు ఇలా అన్నాడు అంతేనా ఇంతకంటే కఠినమైన దేమైనా చెప్పినా కూడా చేస్తానే!. రాజును కోపించుకోవద్దని చెప్పు. భరతుడ్ని రప్పించటానికి దూతను పంపండి. ఇప్పుడే నేను దండకారణ్యానికి పోతున్నా - అనగానే కైక - '' రాజు సిగ్గు పడుతున్నాడు. అందుకే మాటాడ్డంలే! వెంటనే వెళ్ళిపో నీవు వెళ్ళేదాకా అతడు స్నానం గాని, భోజనం గాని చేయడు అని అన్నది. (2-16-1-42) హా! హా! అంటూ రాజు మంచం మీద మూర్ఛపోయాడు. రాముడు లేచిపోతూనే ఉన్నాడు. ఈ దృశ్యం మొత్తం పూర్తయ్యే దాకా దశరథుడు రాముడ్ని పిలవండి అనడం తప్ప రెండో మాట చెప్పలే. నిజానికి ఆయన కోపించవల్సింది.

రాజు స్త్రీలంపటుడు. వృద్ధుడు - శక్తి హీనుడు అని అందరూ అన్నారు చూడండి లక్ష్మణుని వాక్యాలు.

తదిదంవచనంరాజ్ఞః పునర్బాల్య ముపేయుషః
పుత్రః కో హృదయేకుర్యాత్ - (2.18.17)
వృద్ధాప్యంతో మళ్లీ కుర్రాడైన యీ ముసలాడి మాటలే కొడుకు వింటాడు?

రాజు కైక దగ్గరకెళ్తే ఆవర్ణన ఎలా ఉందో చూడండి: -

వృద్ధస్తరుణీ భార్యాప్రాణే భ్యోపి గరీయసీం

.... దదర్శ ధరణీతలే! (2.10.3)

ముసలిరాజు ప్రాణంకన్న ఎక్కువగా ప్రేమించుకునే తన పెళ్లాన్ని నేలపై పడి ఉండడం చూశాడు.

రాముడూ అలాగే తన తండ్రిని గూర్చి అంటాడు

శోకోపహతచేతాశ్చ వృద్ధశ్చ జగతీపతిః

కామభారావసన్నశ్చ తస్మాదేతత్ బ్రవీమితే॥ (2.46.16)

రాముడు సమంత్రునికి చెబుతూ దుఃఖంతో యిలా అంటాడు - ''శోకంలో యీ ముసలిరాజు, స్త్రీలోలుడై ఉన్నాడు గనక నేనొకటి చెబుతాను విను'' అంటాడు. వనవాసంలో మొదటి రోజునో రెండోనాడో లక్ష్మణుడితో రాముడిలా అన్నాడు.

సాహిదేవీ మహారాజం కైకేయీ రాజ్య కారణాత్

ఆపిన చ్యానయేత్ ప్రాణాన్ దృష్ట్వా భరతమాగతం

కామ ఏవార్థ ధర్మాభ్యాం గరీయా నితిమే మతిః

కోహ్యవిద్వానపిపుమాన్ ప్రమదాయాకృతే త్యజేత్

ఛందాను వర్తినం పుత్రం తాతోమామివ లక్ష్మణ। (2-47-6,7,10)

భరతుడు రాగానే కైక రాజ్య కాంక్షతో దశరథుడి ప్రాణాలు తీయదు గదా! అర్థం - ధర్మంకంటే కామమే గొప్పదనుకుంటా! లక్ష్మణా! నాలాంటి పిత్రాజ్ఞా పాలకుడైన కొడుకును - ఒక ఆడదాని మాటవిని - పోగొట్టుకొంటాడా! ఎంత తెలివితక్కువ వాడైనా? - అంటాడు రాముడు.

ఇంత ఘాతుకం చేసి కైకేయి తానెంతో తెలివైన పనిచేశానుకుంటుందేమో! రాజు అన్ని తెలిసిన వాడై కూడా మంత్రి, శాస్త్రి, వృద్ధాదుల్ని పిలిచి యీ విషయం చర్చించలేదే! ఒక స్త్రీ మాటకు లోబడేకదా! కుమారునితో గూడా ఏమీ చర్చించలేదే చిన్నవాడనా! అధికారి కాడనా! సభామధ్య రాజ్యాభిషేకం నిర్ణయింపబడిందే! దీన్ని మళ్లీ సభకు తీసుకురాకుండా రాజొక్కడే ఎలా మార్చగలడు? దీన్ని రాజు సత్య ప్రతిజ్ఞుడని గాక, అతని స్త్రీలంపటత్వాన్ని చేతగాని ముసలితనాన్ని సూచిస్తుంది గదా!.

రాముడు కైకేయి భవనం విడిచి కౌసల్య దగ్గరికి వెళ్ళాడు. అమ్మా నీకు తెలీదా చాలా పెద్ద ఆపద వచ్చింది. ఇదివింటే నీవు - సీత - లక్ష్మణులు దుఃఖిస్తారు. మహారాజు భరతుడికి పట్టాభిషేకం చేస్తాడట నన్ను అడవికి వెళ్ళమన్నాడు. ఆ మాటవినగానే కౌసల్య మూర్ఛపోయింది. రాముడు సేదదీర్చాడు. దుఃఖిస్తూ ఆమె యిలా అంది ఇలాంటి మాటలు వినేకన్నా నాకు పుత్రుడు పుట్టకున్నా బాగుండేదేమో! భర్త ద్వారా నేనే సుఖాలూ పొందలే. కొడుకు ద్వారా కొన్ని అనుభవించాలనుకున్నా జన్మంతా సవతుల ఆటుపోటుమాటలు వినాల్సి వచ్చింది. (దశరథునికెందరో భార్యలున్నట్లుంది) నీవున్నప్పుడూ మాటలు పడ్డాను ఇప్పుడు నీవు వెళ్ళిపోతే చచ్చిపోతా, కైకేయి వైపేగాని నావైపెవరూ చూచేవారు కూడా ఉండరు. నీవు పోతే మాతృ మరణానికి కారనమై నరకానికి పోతావ్ (2.18.23.28) అంటుంది. ఆ మాటలువిని లక్ష్మణుడు - నాకూ యిష్టం లేదు రాముడు అడవికి వెళ్లడం - అంటాడు. రాజుముసలి స్త్రీ వశుడై యథేచ్ఛగా వ్యవహరిస్తున్నాడు శత్రువు కూడా రామునిలో లోపం చూపలేదే! నాకెవరడ్డు

వస్తారో చూస్తా - భరతుడివైపు వాళ్ళనందర్నీ నరికేస్తా నీవు నిశ్చింతంగా ఉండు! అంటాడు లక్ష్మణుడు - కౌసల్య మిన్నకుండి రామునికేసి చూస్తుంది. రాముడేమాత్రమూ వినడు. తండ్రిమాట నెరవేర్చకపోతే ఎలా! నన్ను అడవికి పోనివ్వండి అంటాడు. పరశురాముడు తండ్రి మాటవిని తల్లిని చంపాడు. ఇది అలాంటిదికాదు మనపూర్వులంతా సత్యవ్రతులు - లక్ష్మణా నీ ప్రేమ నాకు తెల్సు. దానికోసం నీవు అధర్మంగా, అన్యాయంగా వ్యవహరించకు భరతుడ్ని పట్టాభిషిక్తుని కానీ. నేను అడవికివెళ్తే కైకేయికి శాంతి లభిస్తుంది. అన్న తర్వాత కౌసల్య చేసేది లేక శుభాశీస్సులిచ్చి పంపింది. అమ్మా నేను వెళ్లిన తర్వాత రాజు పుత్ర శోకంతో కృశిస్తాడు అతడికే కష్టం కలగకుండా చూసుకోండి అని చెప్పిమరీ వెళ్లాడు. (2. 21. 19) కాని కౌసల్య అలా చేయలే.

కౌసల్య మందిరం నుండి తన మందిరానికి వెళ్తాడు రాముడు. అక్కడ సీత అతనికోసం కాసుకుని కూర్చుంది. కౌసల్య కైకేయి ముందు ధైర్యంగా మాట్లాడినా, సీత దగ్గర తన మనో వేదన దాచలేకపోయాడు. రాముడు తలవాల్చి నిలబడ్డాడు. సీత ఎదురు వెళ్ళింది. రాముడు సంతోషంగా లేక పోవడం చూసింది. బాధ దుఃఖం మప్పిరిగొనగా ముఖం పాలిపోయి ఉంది. సీత భయపడ్డది. అభిషేకం కాబోతుంటే ఇలా ఉన్నారేంటి అన్నది. రాముడు సన్నగా విషయం జారవిడిచాడు. సీత నిశ్చేష్టురాలైంది. ఎలాంటి పరిస్థితిలోను నీకు దూరంగా ఉండేదిలేదు - భవభూతి మాటల్లో - త్వయాసహని వస్యామి వనేషు మధుగంధిషు. సుగంధపూరితమైన అరణ్యంలో నీతో నేను నివసిస్తాను. నేనుకూడా అరణ్యవాసం చేసే యోగం ఉందని చిన్నప్పుడు బ్రాహ్మణులంటే విన్నా (2.26.6) ఇలా ఆకస్మికంగా కొన్ని విషయాలు ప్రస్తావించడం రామాయణంలో ఉన్న పట్టులే. కైక ప్రసంగాలలాంటివే. వరాల సంగతి కైకకు జ్ఞప్తిలేవు. వాటిని మంథర గుర్తు చేయాల్సి వచ్చింది. అలాగే కథలో రెండు మూడు స్థలాలలో అలాగే ఉన్నాయి. సీత అలిగి ఏడ్చి రామునితోను అత్తతోను వాదించి అడవికి వెళ్ళే అనుమతి పొందుతుంది. ఎప్పటిలాగే లక్ష్మణుడు చేతులు జోడించి నిలిచాడు. నేను వెళ్ళిన తర్వాత కౌసల్యను సుమిత్రను చక్కగా కాపాడాలి నీవు అనీ అంటుండగానే లక్ష్మణుడు - నీవెక్కడో నేనూ అక్కడే పారా గొడ్డలి మోస్తూ నీ వెంట ఉంటా కౌసల్య కోసం విచారించకు నావంటి వాళ్లని వేయిమందిని భరించగలదామె. ఇక్కడ వేయి అంటే ఒక చమత్కారం ఉంది. దశరథుడు కౌసల్యను వివాహమాడి నప్పుడు దశరథుడు వేయి ఊళ్ళు వ్రాసియిచ్చాడట. ఆవేయి గ్రామాలవారు కౌసల్యను చూస్తారుగా అని ఇక్కడ అర్థం. ఇలాంటి మారుమూల విషయాలు అప్పుడప్పుడు ప్రసంగాల మధ్యలోంచి తెలుస్తాయి. లక్ష్మణుడు సుమిత్ర కడకేగుచున్నాడు.

మళ్లీ వచ్చి నే సింహాసనమెక్కుతానని రాముడనేకమార్లు అనడం కథలో వింటాం అంటే ఈ 14 ఏళ్లూ దశరథుడు పాలిస్తే ఆ తర్వాత నాదేగదానని రాముడి భరోసా. కాని తాను లేనప్పుడు కైక దశరథుడ్ని చంపుతుందేమోనని శంకకూడా! దీనికి గ్రంథంలో ఎక్కడా వివరణ లేదు. ప్రాప్త రాజ్యే నరవ్యాఘ్రే శివేన పునరాగతః (2.46.72) సుమిత్ర కూడా ఇలాగే ఆలోచించింది. (2. 39. 15)

శస్త్రాగారం నుండి ఉత్తమశస్త్రాలు తెమ్మని రాముడు లక్ష్మణున్ని పంపుతాడు. రాముడంతకముందు ప్రజలకు ధనం పంచుతాడు. రామలక్ష్మణ సీతలు పాదచారులై పోవడం చూసి జనం విలపిస్తారు. రాముడొస్తున్నడని విని రాజు వందల కొద్దీ ఉన్న తన భార్యల్ని పిలిచాడు. (సుమారు 700 మంది) కౌసల్యతో సహా వాళ్ళంతా వచ్చారు. నాతప్పేమిటి అని రాముడన్నప్పుడు దశరథుడేమి మాట్లాడలేకపోయాడు. మంత్రుల్నిగాని వశిష్ఠుడ్నిగాని పిలవలే! భార్యల్ని మాత్రమే పిల్చాడు. దీనివల్ల

అతడెంత స్త్రీలోలుడో తెలుస్తుంది. రాముడు వస్తుండగా చూసి స్పృహ తప్పి పడిపోయాడు. రామలక్ష్మణులు అతనినెత్తి మంచంమీద పడుకుండపెట్టారు. స్త్రీలంతా ఏడ్వడం మొదలెట్టారు - ఇది అంతా అంతఃపురంగోల రాజసభలేదు. మంత్రులూ లేరు గురువులూ లేరు. భారతంలో కొట్లాట ఎప్పుడూ బహిరంగంగా ఉండేది. రామాయణంలో ఎప్పుడూ అంతఃపురాల్లోనే స్త్రీలతోనే.

రాముడాజ్ఞ వేడాడు. నన్ను బందీచేసి నీవు సింహాసనం గ్రహించమన్నాడు రాజు. రాముడంగీకరించలే ఈరోజొద్దు రేపు వెళ్ళుదువులే అన్నా రాముడంగీకరించలే. అప్పుడు రాజు సుమంతుని పిలిచి చతురంగ బలమూ ధనధాన్యాలూ సంపద సిద్ధం చేసి యిచ్చి పంపమన్నాడు. దాసదాసీ జనాన్ని కూడా. అడవిలో ఉన్నా రాముడు సుఖంగా ఉండాలని. కైకేయి భగ్గున లేచింది. సిరిసంపదలు లేని రాజ్యమెందుకు? అంటుంది. ఐతే నేనూ రాముడూ వెళ్తాం. నీవు భరతుడు రాజ్యమేలండి అంటాడు దశరథుడు. అంతా వింటున్నరాముడు రాజా! నాకు ధనమెందుకు! ఇంత వస్త్రము ఒక గొడ్డలీ ఇస్తేచాలు. అని రాముడంటూండగానేకైకేయి పరుగుపరుగున పోయి నార చీరలు వస్త్రాలు తెస్తుంది దాన్ని ధరిస్తారు. సీతకు వీలుగాక పోతే రాముడే సర్దుతాడు. రథం సిద్ధపరచి ముగ్గుర్నీ పంపడానికి సిద్ధం చేయమంటాడు. చివరికి దశరథుడు - కౌసల్య కూడా రథం వెంటనడిచారు. తల్లిక్రిందపడుతూ లేస్తూ ఏడుస్తూ వెంటబడుతుంది. రాముడీ దృశ్యం చూడలేక సమంత్రా! రథం వేగంగా పోనీ అంటాడు. అలాగా ఎవరీ మాటా వినకూడదా అని దశరథుడు కోపంతో గొణిగాడు. అంతా ధూళిమయం, నడవలేక రాజు పడ్డాడు. కైక ప్రక్కనే ఉంది. ఛీత్కారిస్తున్నాడు కౌసల్య ఎలాగో అవస్థపడి రాజుని అంతఃపురానికి జేర్చారు.

రాముడు రాజ్యం వీడి వెళ్తున్నప్పుడు
చైత్యశతైః జుష్టః దేవస్థానైః ఉపశోభితః జనపథః.

మార్గం అంతా చైత్యాలు దేవస్థానాలతో నిండి ఉంది. అనే వర్ణన అంత సమంజసమనిపించదు. ఆరాత్రి తమసా నది తీరాన నిద్రించాడు. తనతో వచ్చిన పౌరులు నిద్రలేవకముందు తెల్లవారుఝామున్నే లేచి ఎవరికీచెప్పకుండా శృంగిబేరపురానికివెళ్ళాడు. అక్కడగంగ కనిపించింది. అమ్మా 14 సంవత్సరాల తర్వాత వస్తాము. అప్పుడు పట్టాభిషేకానికి నీ జలాలు తెచ్చి పూజిస్తాము అని సీత మొక్కింది. గుహుని సహాయంతో అంతా గంగను దాటారు. దాటకముందే రామలక్ష్మణులు తమ కేశపాశాన్ని మర్రిపాలు రాసి జెడలుగామార్చి ముని వేషం ధరించారు. అక్కడే సుమంత్రుని వెనక్కి పంపేశారు - లక్ష్మణా నీవు ముందు సీత మధ్య వెనక నేను ఉండి నడవాలి అన్నాడు రాముడు. మరాఠీలో మోరోపంత్ వ్రాసిన రామాయణంలో ముందు రాముడు వెనక మరిది లక్ష్మణుడు అని ఉంది. కాని అది తప్పు.

రాముడు ప్రయాణంలో భరద్వాజాశ్రమం చేరాడు. అక్కడ ఒకరోజుండి వారి సలహాలంది చిత్రకూటం చేర్తాడు. ఆ స్థలం బాగా నచ్చింది. పర్ణశాల నిర్మించమని లక్ష్మణుని ఆజ్ఞాపిస్తాడు. దానిలో గృహప్రవేశం చేయబోయేముందు ఒక నల్ల జింకను బలి యిచ్చి పూజిస్తారు. 14 సం॥లు అక్కడే ఉండాలని అనుకున్నారు. సుఖంగా కాలం గడుపుతూ సుందరవన దృశ్యాల్ని సీతకు చూపిస్తున్నాడు.

నీవు నా అనుకూలవతివి. లక్ష్మణుడు నా ఆజ్ఞలో ఉన్నాడు. నేను ఆనందంగా ఉన్నాను. ఎన్ని సంవత్సరాలైనా ఇక్కడ ఇలా సుఖంగా ఉంటే నాకేం కష్టమూ లేదుగా అంటాడు రాముడు.

(ఇంకా ఉంది)

# కాలుష్య నివారణ - పారిశ్రామిక యాజమాన్యాల పాత్ర

- సి. వి. సర్వేశ్వర శర్మ

సైన్సు విజ్ఞానాన్ని కళాశాల తరగతులకు మాత్రమే పరిమితం చేయక వాడవాడకు పల్లెపల్లెకు ఆ విజ్ఞానాన్ని అందించిన, ఎన్నో బహుమతులను అందుకొన్న, సుమారు అర్ధ శతం సైన్సు పుస్తకాలను వినూతన రీతిలో రాసిన అమలాపురం యస్. కె. బి. ఆర్. కళాశాలనుంచి రీడర్‌గా రిటైర్ అవుతున్న, సి.వి. సర్వేశ్వర శర్మ మునుముందు **మిసిమికి** సైన్సు వ్యాసాలను ధారావాహికంగా అందించడానికి అంగీకరించడం ఆనందదాయకం.

- సంపాదకుడు

పరిశ్రమలు దేశాభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నాయి. కానీ ఆ ఫ్యాక్టరీ గొట్టాల నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు మన పరిసరాల్లో ఉండే గాలిని, వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

రకరకాల మలినాలు గల గాలిని పీల్చడం వల్ల ఎన్ని రోగాలయినా రావచ్చు. ఈ కాలుష్యాలు కొన్ని మత్తు కల్గిస్తాయి, మరికొన్ని ఎలర్జీని సృష్టిస్తాయి. మొత్తం మీద ఇటువంటి గాలిని పీల్చడం వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉంది. పరిశుభ్రమైన గాలిని పీల్చే అవకాశం ప్రతి ఒక్కరికి ఉండాలంటే కలుషితమైన గాలిని శుభ్రపరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పరిశ్రమలు విడుదల చేసే కాలుష్యాల విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక సంఘాలు కాలుష్య నివారణలో తమ వంతు కృషి చేయాలి.

వాయు కాలుష్యం వల్ల మనుషులకే కాదు, చెట్లు, చేమలకు కూడా హాని కల్గుతుంది. మొక్కలు కృశించడం లేదా నశించడం జరుగుతుంది. విలువైన కట్టడాలు రంగులు వెలిసి పాడైపోతాయి. కట్టడాలు పగలడం, విరగడం, మరకలు పడడం, రూపధర్మాలు మారిపోవడం వలన కట్టడాలలో ఉపయోగించిన వివిధ సామగ్రుల జీవిత కాలం తగ్గిపోతుంది. గాలిలో కలిసిన విష పదార్థాలు ఒక చోటు నుండి మరొక చోటుకు పోలేక, ఎక్కువ గాలిలో కలిసి పోలేక హానిని కల్గిస్తాయి. ఇంధనాన్ని వాడుతున్నప్పుడు పొగరావడం ఆపైన పీల్చే గాలిలోని ప్రాణ వాయువు శాతాన్ని తగ్గించి వేస్తుంది.

**శాస్త్రీయ పద్ధతులు:-** వాయు కాలుష్య నివారణకు శాస్త్రీయ పద్ధతులను అవలంబించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కార్మిక, యాజమాన్యాలు నిపుణుల సలహాలు పాటించి అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా ప్రజలు కూడా కాలుష్య నివారణోపాయాలు తెలుసుకోవాలి.

పరిశ్రమల్లో ఉపయోగించే రసాయనిక పదార్థాలను కొన్నింటిని మారిస్తే కాలుష్యాలలో విషవాయువుల మోతాదు కొంత తగ్గుతుంది. బెంజాల్, మెర్క్యూరీ, లెడ్ మొదలైన వాటికి ప్రత్యామ్నాయ పదార్థాలు వాడడం మంచిది.

వ్యర్థ పదార్థాలు జనించే చోటు అవి మన పరిసరాల్లోకి కలవ కుండా ఏర్పాట్లు చేయాలి. పెయింట్ స్ప్రే చేసే కన్నా బ్రష్‌లతో వేయడం మంచిది. నీళ్ళు జల్లితే దుమ్ము పైకి లేవదు. ఇటువంటి జాగ్రత్తలు

కొన్ని పరిశ్రమల్లో తప్పని సరిగా ప్రవేశపెట్టాలి. పరిశ్రమలలో పనిచేసే కార్మికులు వ్యక్తిగతంగా జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆ విధంగా జాగ్రత్తలు తీసుకునేటట్లు యాజమాన్యాలు నిబంధనలు రూపొందించాలి. కార్మికులు కళ్లకు, కాళ్లకు, చేతులకు ప్రత్యేక రక్షణ కల్గించుకోవాలి. ప్రాణ వాయువు అవసరానికి అందుబాటులో ఉండేవిధంగా ఏర్పాటు చేయాలి.

పరిశ్రమలో ఎక్కడ హానికరమైన వాయు పదార్థం విడుదల అవుతుందో అక్కడ నుండి దానిని భద్రంగా, రవాణా అయ్యేటట్లు చేసి దూరంగా గాలిలో కలిసేటట్లు తగిన వెంటిలేషన్ సౌకర్యాన్ని ప్రతి పరిశ్రమ కలిగి ఉండాలి. ఈ కాలుష్యాలను వీలైనంత ఎక్కువ ఎత్తులో గాలిలో వదిలే ఏర్పాటు చేయాలి. అప్పుడు మలినాలు, కాలుష్యాలు మనుషులకు దూరంలో ఉంటాయి. ఎక్కువ వేగంతో వీచే గాలుల్లో ఈ కాలుష్యాలు కలియడం వల్ల అవి బాగా విస్తరించుకుని విలీనం అయిపోతాయి.

తగిన వనరులు చూసుకుని జన సంచారానికి దూరంగా పరిశ్రమలు స్థాపించాలి. యాజమాన్యాలు ఇలా పరిశ్రమలు స్థాపించినప్పటికిని విస్తరిస్తున్న నివాస ప్రాంతాల కారణంగా పరిశ్రమల చుట్టూ నివాసాలు ఏర్పడుతున్నాయి. అందుకే ప్రజలు కూడా కాలుష్యం గురించి బాగా తెలుసుకోవాల్సిన అవసరం వుంది.

**సైక్లోన్ సెపరేటర్స్:-** కాలుష్య తీవ్రతను తగ్గించేందుకు సైక్లోన్ సెపరేటర్స్ వాడాల్సిన అవసరం ఉంది. గాలి ప్రవాహ వేగం తగ్గించడం లేదా దాని పయన మార్గాన్ని మార్చడం వల్ల దుమ్ముధూళి కణాలు వదలిపోయి పరిశుభ్రమైన గాలి సైక్లోన్ సెపరేటర్ ద్వారా బయటకు వస్తుంది.

కాలుష్య గాలి వెళ్లే మార్గంలో నీటిని పైనుండి క్రిందికి స్ప్రే చేయాలి. దీనివల్ల గాలిలోని ధూళికణాలు నీటితో కడిగి వేయబడి శుభ్రమైన గాలి విడుదలవుతుంది. ఈ పనికి స్ప్రేటవర్స్ ఉపయోగించాలి.

లైమ్, సిలికాజెల్, య్యాక్టివేటెడ్ కార్బన్ వంటి రసాయన పదార్థాలను ట్రేలలో ఉంచి వాటి గుండా కాలుష్యపు గాలిని పంపితే అందలి కొన్ని హానికర పదార్థాలను ఈ రసాయనాలు పీల్చేసుకుంటాయి.

**ఫేబ్రిక్ ఫిల్టర్స్**: గాలిలోని మలినాలను, కాలుష్యాలను వడబోత విధానం ద్వారా తొలిగించి కాలుష్య రహితమైన గాలిని విడుదల చేయవచ్చు, ఈ విధానానికి ఫేబ్రిక్ ఫిల్టర్స్ వినియోగిస్తారు.

గాలిలో ఉండే మలినాలను ఫిల్టరులో ఉండే సూక్ష్మ రంధ్రాలు తొలగిస్తాయి. ధూళి కణాలను ఆకర్షింప చేయడానికి, తద్వారా సంగ్రహించి వాయువును శుభ్రపరచడానికి ఎలక్ట్రోస్టాటిక్ ప్రెసిపిటేటర్స్ కూడా వాడవచ్చు.

వాయుశీతలీకరణ విధానం పైన ఆధారపడిన కండెన్సర్లు కూడా వినియోగించవచ్చు. పరిశ్రమలు బాగా విస్తరిస్తున్న విశాఖపట్టణం వంటి నగరాల్లో వివిధ పారిశ్రామిక సంస్థలు స్వచ్ఛందంగా నగరంలో రోడ్ల కిరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ చేస్తూ నగరాన్ని హరితమయం చేయడం సముచితమైన చర్య.

తమ ఫ్యాక్టరీలు విసర్జిస్తున్న వాయు కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకుని పారిశ్రామిక సంస్థలు ఇలా చెట్లు నాటే కార్యక్రమాన్ని అమలు పరచడం గమనించ తగిన విషయం

**బోధనాంశం కావాలి:-** పరిసరాల శాస్త్ర విజ్ఞానాన్ని అన్ని స్థాయిల్లోనూ బోధనాంశంగా చేర్చాలి. పరిసరాల్ని పరిరక్షించుకోవడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యతగా గుర్తెరిగి పరిసరాల చైతన్యాన్ని మన జీవన సరళిగా అలవరచుకుని మన చుట్టూ వున్న పచ్చదనాన్ని పదికాలాల పాటు పదిల పరచుకోవాలి.

మనిషికి సగటున రోజుకి 15 కిలోల స్వచ్ఛమైన గాలి, ఒకటిన్నర కిలోల ఆహారం, రెండున్నర కిలోల నీరు అవసరం. ప్రత్యేకించి పరిశ్రమలు సాలీనా నాలుగు మిలియన్ల టన్నుల సల్ఫర్‌డై ఆక్సైడ్, ఒక మిలియను టన్నుల కార్బన్ మోనాక్సైడు, ఏడు మిలియన్ టన్నుల వివిధ రకాల వాయువులను విసర్జిస్తున్నాయని ఒక సర్వేలో వెల్లడయింది.

'మన దేశంలో వున్న కర్మాగారాల్లో కేవలం యిరవై శాతం కర్మాగారాలు మాత్రమే కాలుష్య నివారణ దిశలో ఆధునీకరణం చేయబడినట్లు చెపుతున్నారు.

మధురలోని రిఫైనరీ వదిలే సల్ఫర్ డై ఆక్సైడ్ వల్ల అపూర్వ కళాత్మక కట్టడం తాజ్‌మహల్ దెబ్బ తింటుందని కేంద్ర పరిసరాల సంస్థ తెలియజేసింది.

మన రాష్ట్రంలో హైదరాబాద్‌లో కొన్ని పరిశ్రమలు, కొన్నిచోట్ల సిమెంట్ కర్మాగారాలు వాయు కాలుష్యాన్ని కలుగజేస్తున్నాయి.

**విషాద సంఘటన:-** అంటార్కిటాకు వెళ్ళిన తొమ్మిదో భారతీయ శాస్త్రజ్ఞుల బృందంలో నలుగురు శాస్త్రవేత్తలు మరణించిన దుస్సంఘటన ఎలా మరచిపోగలం. వీరి మరణానికి ముఖ్య కారణం. కార్బన్ డయాక్సైడ్ విష వాయువని నిర్ధారించడం జరిగింది. వీరు నిద్రిస్తున్న గదిలో ఒక జనరేటర్ పనిచేస్తూ ఉండడం వలన గది వాతావరణంలో కార్బన్ డయాక్సైడ్ గాఢత బాగా పెరిగినందువల్ల శాస్త్రజ్ఞుల ఊపిరి ఆడక శాశ్వతంగా కన్ను మూశారు.

వాయు కాలుష్యం కన్నా ప్రమాదకరమైంది జల కాలుష్యం. వ్యవసాయానికి వాడే క్రిమి సంహారక మందుల వల్ల, కర్మాగారాల నుండి వెలువడే మురికినీటి వల్ల, పెట్రోలియంకు సంబంధించిన పదార్థాలు, రేడియో ధార్మిక వ్యర్థ పదార్థాలు, గనుల నుండి వచ్చే వ్యర్థ పదార్థాలు జల కాలుష్యానికి కారణాలవుతాయి. ఖనిజాల వల్ల ఉపరితలమే కాకుండా భూగర్భ జలం కూడా కలుషితమయిపోతోంది.

**భూగర్భ జలాలు:-** తమిళనాడులోని సేలంలో క్రోమైడ్ పరిశ్రమ నుండి వెలువడే వ్యర్థ పదార్థాలు అక్కడ భూగర్భ జలాలను కూడా కలుషితం చేయడం వల్ల బోరింగ్ బావులు, ఇతర బావులలోని నీరు పసుపు పచ్చని రంగులో ఉండి, వాటిని తాగిన వారికి అనేకములైన వ్యాధులు కలుగుతున్నట్లు తెలుస్తోంది. రాయలసీమలో లక్షలాది టన్నుల రకరకాల ఖనిజాలు నిక్షిప్తమై ఉన్నాయి. ముగ్గురాయి, రాతినార, టాల్క్, సున్నపురాళ్ళు, రాగి, సీసం, తుత్తునాగం మొదలయిన ఖనిజాలు గనుల యాజమాన్యం వారు ముడిఖనిజాన్ని బయటకు తీసేటప్పుడు సరియైన చర్యలు తీసుకోనందు వల్ల అక్కడ పరిసరాలు కాలుష్యానికి గురి అవుతున్నాయి. ఈ గనులలో పని చేసే కార్మికులు అక్కడి కాలుష్యపు గాలిని పీల్చడం వలన, కాలుష్యపు నీటిని తాగడం వలన కొన్ని దీర్ఘకాలిక, అంతర్గత వ్యాధులకు గురి అయ్యే ఆస్కారముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆ చుట్టు ప్రక్కల ప్రాంతాలు కూడా కాలుష్యానికి గురయ్యే ప్రమాదముందంటున్నారు. కొన్ని ఖనిజాలు పరిసరాలపై కాలుష్యం సృష్టించి, అక్కడి ప్రజలలో వ్యాధులు సృష్టిస్తున్నాయని కొందరి శాస్త్రవేత్తల అభిప్రాయం.

**రాతినార గనులు:-** కడప జిల్లాలోని పులివెందుల తాలూకాలో దొరికే రాతినార ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఇప్పటికే ఎంతో ఖనిజాన్ని తవ్వి వెలికి తీసి ఎగుమతి చేశారు. అనేక గనులు ప్రయివేటు యాజమాన్యంలో ఉన్నాయి. ఎంతో మంది కార్మికులు రాత్రింబవళ్ళు కష్టపడి పని చేస్తూంటే యాజమాన్యం ఖనిజాన్ని విదేశాలకు ఎగుమతి చేసి బోలెడంత డబ్బు ఆర్జిస్తోంది. ఈ ఖనిజం వల్ల పరిసరాలు కాలుష్యం అయి ఆస్‌బెస్టాస్ వ్యాధి వచ్చే అవకాశముంది. ఎవ్వరూ ఈ పరిసరాల మీద పరిశోధన చేసిన జాడలేదు. మన దేశంలో రాతినార రెండు రాష్ట్రాలకే పరిమితమైంది. ఒకటి మన రాష్ట్రం, రెండవ రాష్ట్రం బీహార్.

బీహార్‌లో దొరికే ఆంఫీబోల్ రకం మన రాష్ట్రంలో దొరికే క్రైసోటిల్ రకం కన్నా అపాయకరమైనది. క్వార్ట్జ్‌లో ముఖ్యంగా 'సిలికా' అనే మూలకం ఉంది. ఇది 'సిలికాలిసిస్' అనే ఊపిరి తిత్తుల కాన్సర్‌కు మూలధాతువు. గనులలో బ్లాస్టింగ్ చేసినప్పుడు దీని పొడి వాతావరణంలో కలిసి కాలుష్యాన్ని కలుగజేస్తుంది.

అదే విధంగా ముగ్గురాయి. దీని పొడితో కలుషితమైన గాలిని దీర్ఘకాలం పీలిస్తే ఊపిరితిత్తులు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీనికి సంబంధించిన పరిశ్రమలలో పనిచేసే కార్మికులు కొద్ది కాలం విశ్రాంతి తీసుకుని మళ్లీ పని చేస్తే ఆరోగ్యం దెబ్బతినదు.

**యాజమాన్యాల చర్యలు:-** యాజమాన్యాలు ఈ గనులలోకి గాలి రావడానికి, కాలుషితమైన గాలి బయటికి పంపడానికి ప్రత్యేక ద్వారాలు ఏర్పాటు చేయాలి. పరిశ్రమల చుట్టు ప్రక్కల ప్రాంతాలు తడిగా ఉంచడం ద్వారా వీటివల్ల వచ్చే పొడి వాతావరణాన్ని కలుషితం చేయకుండా కొంత వరకూ కాపాడవచ్చు.

ఈ గనులలో మంచి పరికరాలు ఉపయోగించడం వల్ల కూడా ధూళి రాకుండా నిరించవచ్చు. గని కార్మికులు కళ్లకు అద్దాలు, చేతులకు, ముక్కుకు ప్రత్యేక వస్త్రాలు కట్టుకోవడం వల్ల కూడా వ్యాధి రాకుండా అరికట్టవచ్చు.

వీటిలో పని చేసే కార్మికులకు అప్పుడప్పుడు ఊపిరితిత్తులు పరీక్ష చేయించడం మంచిది. సమస్యలు కనిపించినప్పుడు వాటికి పరిష్కార మార్గాలు వెతకాలి. పరిశ్రమలను మూసివేయడం పరిష్కారం కాదు.

వ్యర్థ వాయువులు, రద్దు పదార్థాలను కలుషితంగా వదలి వేయడంకన్నా వాటిని కూడా ఉపయోగకరమైన పదార్థాలుగా మార్పు చెందించే ఫ్యాక్టరీలు నెలకొల్పాలి. కాలుష్య నివారణోపాయలకు శాస్త్రవేత్తలు కృషి చేసేటట్లు పరిశ్రమల యాజమాన్యాలు ప్రోత్సహించాలి. పరిశ్రమలలో వాడే ఇంధనాలకు బదులుగా తక్కువ రద్దును వెలువరించే ఇంధనాలను అన్వేషించాలి. సౌరశక్తిని ఉపయోగించుకుని పరిశ్రమలను నడిపే రోజులు వస్తే ఈ వాతావరణ కాలుష్యానికి పెద్ద పరిష్కార మార్గం లభించినట్లవుతుంది. కాలుష్య జనకాలను తొలగించుకోవడం అసంభవమనే ప్రజలలోని ఉదాసీనం ఈ కాలుష్య సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది.

ఇప్పటి వరకు జరిగిన సర్వేల ఆధారంగా ప్రపంచ దేశాల్లో భారతదేశంలోనే అధిక శాతంలో పారిశ్రామిక కాలుష్యం ఏర్పడుతోంది. మన దేశంలోనే అధిక శాతంలో ప్రకృతి సహజ వనరులు అంతరించి పోతున్నాయని నిర్ధారించబడింది. ఈ పరిస్థితిని నివారించడంలో కార్మిక - యాజమాన్యాల పాత్ర ఎంతో ఉంది.

# సుమేరియన్ ప్యారడైజ్ ల్యాండ్ ''తెల్‌మన్'' భాష తెలుగు?

- సంయుక్త కూనియ్య

తెలుగు భాష ఎప్పుడు పుట్టిందో ఎవరూ ఇతమిద్ధంగా చెప్పలేరు. అసలు ఒక భాష ఏదో ఒక నాడు ఒక శుభ ముహూర్తాన ఆవిర్భవించదు. ప్రజలు ఒకరితో ఒకరు భావ ప్రసారాన్ని జరుపుకొనడానికి సంజ్ఞలు, పదాలు పుట్టుకొస్తాయి. అవసరం కొలదీ భాష ఆవిర్భవిస్తుంది. క్రమక్రమంగా ఒక నిర్దుష్టరూపం తీసుకొని ఒక ప్రాంతానికి, సంస్కృతికి చెందిన ప్రజల భావ ప్రకటనావసరాలకు పరిమితమైనప్పుడు అది ఒక భాష అవుతుంది. ఆ ప్రాంతాన్ని బట్టో, ఆ సంస్కృతిని బట్టో దానికా పేరు వస్తుంది. ఏ భాష అయినా ఇలా రూపొందవలసిందే.

తెలుగుగూడ ఇలా రూపొందిందే. మరి అది ఏ కాలంలో రూపొందింది? దీనికి సమాధానాలు వివిధాలు. నన్నయ్యకు ముందు కావ్య భాష లేదంటారు. ఇది సమర్థనీయం కాదు. కావ్య భాష గూడ అప్పటికప్పుడు ఆకాశం నుంచి ఊడి పడదు. దానికి ముందు అది ఎంతో కాలంగా అభివృద్ధి చెంది ఉండాలి.

వ్యాస రచయిత్రి సంయుక్త కూనియ్య తెలుగు ప్రాచీనతను పరిశోధించి ఆ పరిశోధనా ఫలితాలను మనముందు ఉంచుతున్నారు. విజ్ఞులైన మిసిమి పాఠకులు ఈ పరిశోధనాత్మక వ్యాసానికి ప్రతిస్పందిస్తారని ఆశిస్తున్నాం. - సంపాదకుడు

సుమేరియన్ నాగరికత ప్రపంచంలో చాలా ప్రసిద్ధిగాంచినది. సుమేరియన్లు ఎక్కడి నుంచో 'వలస' వచ్చి, మెసపటోమియా ( ఇరాక్) కి దిగువ ప్రాంతంలో నివాసం ఏర్పరచుకున్నారు. సుమేరియన్లు ఎక్కడి నుంచి వచ్చారో? ఎవరికీ తెలియదు. సుమేరియన్లు తమ గాథలలో ''తమ పూర్వికులు సూర్యుడు ఉదయించే దిక్కునుంచి వచ్చినట్లు, అక్కడ తమ ప్యారడైజ్ ల్యాండ్ అయిన తెల్‌మన్ **(Telmun)** వున్నట్లు ''ఎంకి'' **(Enki)** దేవుడు తమ దైవం, జియిశూద్ర **(Ziusudra)** తమ పూర్వికానికి మూల పురుషుడని **"Cuneiform Tablets** పైన వివరాలు వ్రాసి వున్నారు.

**"Holy Bible"** ల్లో **Old Testment"** లో వున్న **"Genesis"** లోని గాథలు, ''సుమేరియన్ ప్యారడైజ్ ల్యాండ్ తెల్‌మన్'' గాథలను ఆధారంగా తీసుకుని వ్రాయబడినవి.[1] సుమేరియన్ల మూల పురుషుడైన ''తెల్‌మన్'' నివాసి అయిన ''జియిసూధ్ర పేరు **"Holy Bible"** ల్లో **"Noah"** గా వ్రాయబడి వుంది.[2]

సుమేరియన్ల ప్యారడైజ్ ల్యాండ్ అయిన 'తెల్‌మన్' ఎక్కడుందో? ఇప్పటివరకు ఎవరు తెలుసుకోలేక పోయారు. కాబట్టి రెండువేల ఐదువందల సంవత్సరాల క్రితమే మరుగైపోయిన 'తెల్‌మన్ నాగరికతని చరిత్రకారులు **"Lostcivilization"**గా పేర్కొన్నారు.[3] **"Lost Civilization"** గా చెప్పబడిన ''తెల్‌మన్''కి చెందిన భాష వాడుకలో లేదని స్పష్టంగా చరిత్రకారులు అభిప్రాయం వ్యక్తపరిచారు.[4]

సుమేరియన్ల ప్యారడైజ్ ల్యాండ్ అయిన తెల్‌మన్ ఎక్కడుందో? తెలుసుకుంటే, **Genesis** లో చెప్పబడిన **Land of Shinar,**[5] వివరం తెలుస్తుంది. ఈ వివరం ద్వారా **Ziusudra** గా చెప్పబడిన **Noah,**[6] **Abram**[7] లు ఎక్కడివారో? తెలుస్తుంది. ''అబ్రహం''గా పిలవబడిన ''అబరాం'', **"Father of Many Nations"** గా చెప్పబడటమే కాక, **'Old Testment"** కి చెందిన 'జ్యూయిష్',

'క్రిస్టియన్', 'ముస్లిమ్' మతములవారు ఈ ప్రపంచం అంతా నిండుకుని వుండటం వలన, సుమేరియన్ల నాగరికత నశించినప్పటికి, సుమేరియన్ల ప్యారడైజ్ ల్యాండ్ అయిన 'తెల్మన్' ఎక్కడుందో? తెలుసుకోవలసిన అవసరం చరిత్రకారులకు ఏర్పడి వుంది.

ఒక History Student గా, అమాచ్యుర్ అర్కియాలజిస్ట్గా, నేను కూడ ''సుమేరియన్ ప్యారడైజ్ ల్యాండ్'' అయిన ''తెల్మన్'' ఎక్కడుందో? కనుక్కొనే ప్రయత్నం ప్రారంభించాను.

''సుమేరియన్లు'' ప్యారడైజ్ ల్యాండ్ అయిన ''తెల్మన్'' నుంచి వెళ్ళి, సుమేర్లో స్థిరపడినప్పటికి, తమ పూర్వికులతో సంబంధ, బాంధవ్యాలు తెంచుకోలేదు. తెల్మన్ మధ్య, సుమేర్ మధ్య వర్తక సంబంధం ఏర్పడింది. అలా వారి మధ్య వర్తక సంబంధం స్థిరపడటం వలన, ప్రపంచానికి చాలా వివరాలు తెలిశాయి.[8] అలా తెలిసిన వివరాల ద్వారా నేను, ''తెల్మన్'' అనబడినదే నేటి ''తెలుగునాడు'' అని, ఆనాడు వారు ఉత్తరాలలో Cuneiform లిపిలో Clay Tablets పై వ్రాసిన భాష ద్రావిడ భాష అని తెలుసుకున్నాను. ద్రావిడ భాషలలోని తెలుగు భాష ముఖ్య పాత్ర వహించి వున్నది. తమిళ భాష, కన్నడ భాష కుడి ఎడమ భుజాలుగా నిలచి వున్నవి. పలు ఉత్తరాల ద్వారా, Records ద్వారా, Articles ద్వారా, చరిత్ర కారులు ''తెల్మన్'' వివరాలు సేకరించి, ప్రచురించి వున్నారు.

సుమేరియన్ల చరిత్రలో తొలుత చెప్పుకోదగిన చక్రవర్తి ''అస్సుర్ బానిపాల్'' (Assur Banipal)[9] అతని లైబ్రరీ నుంచి ఇరవై ఐదువేల Clay Tablets సేకరించబడినవి. వాటి ద్వారా తెల్మన్ యొక్క ప్రాముఖ్యత వెలుగులోకి వచ్చింది. 2520 B.C లో ''దిల్మున్'' (Dilmun, లేదా Telmun) వారు, పరాయి దేశం నుండి ''నావ'' (Ship) లో ''చెక్క'' (కలప, wood) తీసుకువచ్చి, ''లగష్'' (Lagash) రాజైన, 'ఊర్ - నన్షె' (UR - Nanshe) కి ఇచ్చినట్లు, Earliest Documented Record తెలియజేస్తుంది.[10]

'' ఇరాక్''లో త్రవ్విన పలు త్రవ్వకాల మూలంగా, ఎన్నో రాజభవంతులు వెలువడడమే కాక, "Ea-Nasir" అనబడిన వర్తకుడి ఇల్లు "UR" లో వెలువడింది. రాజ భవంతులలోను, EA-Nasir. ఇంటిలోను బోలెడన్ని Clay Tablets దొరికాయి.

పలుచోట్ల దొరికిన Clay Tablets లో వున్న ద్రావిడ భాష వివరాలు:- Igin Larsa Period (2025 BC To 1763 BC) గా Lambert చెప్పిన 'Susa Business Contract" లో వున్న వివరం:-[11] ఇలా వుంది.

10 MA - NA URUDU (X?) = Ten Minas of Copper.

ITi E-LA - Matum = (In) The Month of Elamatum.
ఇతి ఇల మాతమ్ = ఇల మాతమ్ నెలలో ( ఇది ఇల మాతమ్)

Ki A-AB-BA = From APPA? (CF UET V5)

అబ్బాకి = అప్పా నుండి.

(తండ్రికి) = (తండ్రి నుండి)

పై రికార్డులో ద్రావిడభాషలోని సంపూర్ణపదాలతో ''ఇది ఇళమాతమ్'' వ్రాయబడి వుండటంవలన ''తెల్మన్'' భాష ద్రావిడ భాష అని స్పష్టంగా తెలుస్తుంది. ''ఇతి'' లేక ''ఇది''గా వ్రాయబడిన పథం ''తెలుగు''లో వాడుకలో వున్నది.

ఉదాహరణ:- ''ఇది మా ఇల్లు''

''ఇల'' లేక ''ఇళ'' పథం తమిళభాషలో వాడుకలో వుంది.

ఉదాహరణ:- ఇళసు = లేత, ఇళమై = పరువం, ఇళయరాజా = యువరాజా.

''మాతమ్'' అనగా తమిళంలో ''నెల'' అని అర్థం.

ఉదాహరణ:- మార్గళి మాతమ్.

''ఇళమాతమ్'' పేరు మీద ఏ నెల తమిళంలో, వాడుకలో లేదు.

'తండ్రి' ని తెలుగులో 'అబ్బా' అని కూడా అంటారు.

ఉదాహరణ:- ''ఎవడబ్బ సొమ్మని మురిసేవు రామచంద్రా?'' భక్తరామదాస కీర్తన చాలా ప్రసిద్ధి గాంచింది.

''తండ్రి'' ని తమిళంలో ''అప్పా'' అంటారు.

ఉదాహరణ:- ''అప్పా అమ్మా'' = ''తండ్రి తల్లి''

**Tilmun (Telmun)** కి సంబంధించిన రికార్డ్ వున్న, **Sargon (Cyl KB 1142 - 21)** ''సిలింద్రకల్ సీల్'' లో[612]

**Sind + Aram - Bab - Anu > Sandanu** సింద్ + అరమ్ - బాబ్ - అను > సందను

(సింథారమ్ బాబ్ - అను > సందను) పేరు వ్రాయబడి వుంది. ఈ పేరు తమిళ భాషకు చెందినది.

ఉదాహరణ:- **Sind** (సింద్) = 'సిందు' పేరు తమిళంలో వుంది. ''సింద్నై'' అనగా ''ఆలోచన''.

**ARAM** (అరమ్) = ''అరమ్ వాళ్ళు'' అని తెలుగువారు తమిళం వారిని అంటారు.

''సిందారమ్ బాబు'' అనే పేరు వున్నతన్ని ''సందను'' అని కూడా పిలుస్తారనే వివరం తెలుపుతున్న ''సిందారంబాబు అను సందను'' వాఖ్యంలోని పదాలు స్పష్టంగా తెలుగు పదాలు.

ఉదాహరణ:- ''పినాకిని'' అను ''పెన్నా'' నది, ''నెల్లూరు'' అను ''సింహపురి'' లో ప్రవహించుచున్నది.

సందను = 'సందనం' అనగా 'చందనం' అని తమిళంలో అర్థం. ఉదాహరణ:- 'సందన శిలై' అనగా 'చందన శిల్పం'.

సందను = 'సంతాను', 'సంతానం', 'సంతానలక్ష్మి' పేర్లు వున్నవి.

ఇదే సరిగాన్ 'సీల్'ల్లో **Kommel EG 5433 = MUR - GUN (-Gun)- NU** పేర్లు కూడ వున్నవి. ఈ రెండు పేర్లు తమిళ భాషకు చెందినవి.

**Kommel =** 'కొమ్మెల్' పేరు 'వడివేల్' తమిళంలో వున్నవి.

**(Komm + EL =** కొమ్మెల్)

ఉదాహరణ:- పసుపుకొమ్ము, ఎద్దు కొమ్ము,

''నీకేమైనా కొమ్ములొచ్చాయా?'' అంటుంటాము.

**Murgunnu = Murugan** పేరు ఇంకా వాడుకలో వుంది.

ఉదాహరణ :- పార్వతీ పరమేశ్వర్ల కుమారుడైన సుబ్రమణ్యస్వామికి తమిళంలో ''మురుగన్'' అనే పేరు వుంది.

The Neo-Babylonian Har-Ranu Transaction[13]లో The Business activities referred to are per formed typically "INA ALU U SERI" ( ఇన అలు యు సెరి = ''ఆళుక్కు సెరి పాది'', అనగా ''మనిషికి చెరిసగం''గా తమిళంలో పదాలు వాడుకలో వున్నవి). In The City and Overland, only Vs IV 11 : 8 Refers to the Sharing of the Losses in the Unique Phrase "Together they will make profits and suffer losses (i - s "AQ QU - U" U : - S "Appilu" అక్కు, అప్పిలు' = 'హక్కు'లోను అనగా 'లాభం'లోను, 'అప్పు' లోను అనగా 'నష్టం'లోనుగా, తెలుగులో పదాలు వాడుకలో వున్నవి,

ఉదాహరణ:- అక్కు = హక్కు = మనిద్దరం వ్యాపారంలో సమభాగస్తులం, వచ్చిన లాభంలో సగం తీసుకునే హక్కునాకుంది. అని వ్యాపారస్తులు అంటుంటారు.

'అప్పు' పథం మాత్రం నష్టానికి మారుపదంగా వాడటంలేదు.

ఉదాహరణ:- ''నేను నీ దగ్గర అప్పుగా తీసుకున్న డబ్బుకి వడ్డీతో కలిపి ఇచ్చేస్తున్నాను'' అని బాకీపడ్డవాళ్ళు అనటం వింటుంటాము.

పై వొప్పందం Alik Telmun Merchants వ్రాసుకున్నది.

Linguistically are of interest e.g. The Writing A-Na-Am-Di-in in Vet V 81 : 8 and the Subjunctive - Suffix - Na In Vet V 265 : 12 Case Line 9 (Also Attested in other old - Babylonian Dialects) Note Further More The "Provincial" Spellings in Vet V 30 : 12 "Ni - MA - AK - KU - is - Ku - Nu - Ti" [14] ( నిమక్కు ఇస్కునుటి పదాలలో, ''నిమక్కు'' అనే పథం, కన్నడంలో 'నిమగె'గా వాడుకలో వుంది, 'నిమగె' కి అర్థం, 'తమరికి' 'లేక' 'మీకు'. 'ఇస్కునుటి' పథం తెలుగులో 'ఇచ్చుకుంటి' గా వాడుకలో వుంది). The interesting tablet Vet V 428 Seems to contain two sample texts for loan connected with the oversea trade of "UR". The first of these formulae (Lines 1-9) runs as follows "5 shekels of silver as a tadmiqtu - loan (Nam, Ka. SA6. SA6. Gi. DE) $PN_1$ Has Borrowed From $PN_2$. He will return the silver at a moment (Yet) to be determined (?) Text : Ki. An. KAL. Bi. SE = "ANA Ittisu" [15] ('ఆణ ఇట్టిసు' పదాలు కన్నడంలో వున్నవి, 'ఆణ' అనగా 'ప్రమాణం', 'ఇట్టిసు' అనగా 'చేసెను'. 'ప్రమాణం చేసెను (This)"He has sworn by the life of the king" అతను మహారాజుగారి జీవితంపై ప్రమాణం చేసెను.)

Telmun కి చెందిన Nanni[16] అనే వ్యాపారి, సుమేర్‌కి చెందిన EA - Nasir అనే వ్యాపారి కలసి తమ వ్యాపారానికి సంబంధించిన వొప్పందాన్ని (Contract or Deed) గుడిలో దైవ సన్నిదిలో వ్రాసుకున్నారు. EA - Nasir సుమేర్‌లోని "UR" ( ఊర్ లేదా ఊరు) నివాసి, అతను 1974 B.C. లో బ్రతికి వున్నాడు.[17] 'నన్ని'కి మేలురకమైన రాగి సరఫరా చేస్తానని, EA - Nasir, అగ్రిమెంట్‌లో వొప్పుకున్నాడు. వారిద్దరి మధ్య జరిగిన వొప్పంధంలోనే "Ana Ittisu" పథాలు వుండటంవలన ఆ రికార్డుని Ana Ittisu" Recordగా చరిత్ర కారులు పేర్కొన్నారు. ఇప్పటికి తెలుగులో 'ప్రాంసరీ నోటు' వ్రాసేటప్పుడు తొలుత 'ఆణ' అని వ్రాయటం పరిపాటిగా వుందని తెలుస్తుంది. Ea - Nasir వొప్పుకున్న ప్రకారం, మేలురకమైన రాగి ఇవ్వకపోగా, మధ్య వర్తి దగ్గర నాసిరకమైన రాగి ఇచ్చి "Take it or leave it" అని చెప్పి పంపాడు.

నాసిరకం రాగితో పాటు EA - Nasir అన్నమాటలు కూడ Nanni కి చేరాయి. నాసిరకమైన రాగి (Copper in Gots) ని చూసి Ea - Nasir అన్నమాటలు విని మండిపడ్డ Nanni, తెలుగు భాషలో "Cuneiform" లిపిలో Clay Tablet పై ఉత్తరం వ్రాశాడు.[18]

**"We find the verb Dummuqvum in the Letter Vet V 7. in A Heandiaadyas construction (CF for aparallel, Be VI (94 : 4) That this nothing. To do with the object of the transaction which happens to be copper "Be Kind Enough to give all the copper which you owe to $PN_1$. (WA - Ri - A - AM MA - La L - Li - K (A) i - SU - U. DU - UM - Mi - iQ - MA A - NA N (i) - Di - iN) "And Offend Me?.**

**iA - A - Ti A - NA Ki (i) - MA MA - AN - Ni - iM** ( అయ్యా! అది అన్నా కిమ్మని యుమ్)

**Tu - Si - IM - MA - NI (I) - MA KI - A - AM TU - ME**

( తూసి ఇమ్మని మాకి అంటుమె)

**i (S - An) Ni.**

( అయి నీ)

**Lines 16 - 18 (That This Could Hppen Between) Gentlemen as we both are**

**MA - A - Ri A - WE - Li Ki - MA NE Ti**

( మరి ఆ వెల కిమ్మనెటి)

**(Eliptic In Line 19) and he continues "Who Is there amongst the Telmun Traders who has (ever) acted against me in this way. I - NA A - Li - iK TE - EL (i) - MU - UN**

( అయినా అలికి తెల్మున్)

**MA - AN - NU - UM SA Ki - A - AM. I - Pu - SA - AN - Ni - i - MA?**

( మీ అన్యుయమ్ సకియమ్, ఇప్పుస అన్ని ఐమా = మేము అన్యాయమ్ సహించము, అయినా ఇంత అన్యాయమా? )

**Lines 26 - 27, more important however, is the argument of Ea - Nasir which the writer quotes verbatim in lines 33 - 39: "I Myself gave on account of you 19 Talents of Copper to the palace And "Sumi - Abum" gave (Likewise) 18 Talents of Copper. Apart from the sealed document which we both handed over to the Temple of Shamash"[18].**

Nanni ఉత్తరం ద్వారా తెలుగు వారికి జరిగిన మేలు మాటల్లో చెప్పలేనిది. ద్రావిడ భాషల్ని గురించి తెలియజేసే Telmun Records అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలలోని ''యూనివర్సిటీ''లలో చాలా వున్నాయి. నన్ని ఉత్తరం ఇచ్చిన ప్రోత్సాహంతో, తెలుగువారు ముందడుగు వేసి, ఆయా యూనివర్సిటీల నుంచి Record ల ప్రతులను సేకరించే ప్రయత్నం ప్రారంభిస్తే, ఆంధ్రుల చరిత్రలో నూతన అధ్యాయం ప్రారంభం అవుతుంది. ఇప్పటి వరకు, తెలుగు వారికి, తెలుగును గురించి వున్న అపోహలన్నీ చెదరి పోయేందుకు సాక్ష్యంగా నన్ని ఉత్తం శాశ్వతంగా నిలుస్తుంది.

'తెల్మున్' కి చెందిన Nanni నుంచి Ea - Nasir కి చేరిన ఉత్తరాలు ప్రపంచ ప్రఖ్యాతి గాంచినవి. ఇలా తెలుగు భాషలో Nanni ఉత్తరం వ్రాయటం వలన, 1907 B.C. లో తెలుగుభాష, ఆ భాషని మాట్లాడే తెలుగువారు 'సుమేరియన్ ప్యారడైజ్ ల్యాండ్' అయిన "Telmun" లో వున్నారని రుజువవుతున్నది.

అసలు ఈ Telmun ఎక్కడ వుంది? ఆకాలంలో భారతదేశంలో ' ఆంధ్రనాడు వుందా? వంటి సందేహాలకి ' మరుగున పడ్డ వారసత్వం' గ్రంథం[19] ఆధారం చూపుతుంది.

'ఆంధ్రపురం ( ఆంధ్రపుర) అనే ఒక నగరం 'తెలెవాహ' నది మీద వుందని 'శెరవనియ జాతక' కథ చెప్తున్నది. తెలెవాహ తూర్పు దక్కనులోని ఆధునిక 'తెల్' ( మహానది ఉపనది) ఆంధ్రపురం ఒక చిన్న రాజ్యానికి రాజదాని అయి వుండవచ్చు. 'తెల్‌లోయ' దానితో పాటు తెలుగు మాట్లాడే విశాఖపట్టణం ప్రతిష్టానాన్ని ఏలిన శాత వాహనుల పాలన క్రిందకు ఎప్పుడు వచ్చినట్లు కానరాదు.' 'మరుగునపడ్డ వారసత్వం' గ్రంథంలో చెప్పబడిన, తెల్‌లోయ (Tel Valley) ద్వారా సుమేరియన్ల ప్యారడైజ్‌ల్యాండ్ అయిన తెల్‌మన్ తెలుగునాడే అని స్పష్టంగా అర్థం అవుతుంది.

తెల్ + మన్ = తెల్‌మన్ అనగా తెల్ (Tel) నది వొడ్డున వున్న భూభాగంగా తెలుగులో అర్థం.

సుమేరియన్ల ప్యారడైజ్ ల్యాండ్ అయిన Telmun, Holy Bible ల్లో చెప్పబడిన Genesis లోని "Land of Shinar"[20] ఒకటి కావటం వలన, ప్రపంచ చరిత్రలో Telmun చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. Holy Bible ల్లో Old Testament లోని[21] Seraiah (సేరయ్య) Meraiah (మీరయ్య). Hashabiah (హషబయ్య) Sherebiah (షెరబయ్య) తెలుగుతనానికి అద్దంలా నిలిచున్నాయి.

Indus Valley Civilization" కాలంలో, తుంగభద్రలోయ నాగరిక లిపి చిహ్నాలు, సింధూ నాగరికతా లిపి చిహ్నాలు పెక్కు పోలికలతో నిండుకొని వున్నవి[22] కాబట్టి, సింధూ నాగరికత ఉన్న కాలంలో, ఆంధ్రనాడు కూడ వుందని తెలుస్తుంది.

"Telmun Civilization" కాలంలో Indus Valley ని "Melukhakha" (మేలక్క = మేలైన అక్క = తెలుగుపదాలు)[23] గాను, "Meluhha" (మెలుహ = మేలైన ఊహ = తెలుగు పదాలు) గాను[24] వుండటంవలన, ఆకాలంలో తెలుగు భాష ఒక్క ఆంధ్రనాడులోనే కాక, Indus Valley Civilization లో కూడ వాడుకలో వుందని తెలుస్తుంది.

ఉదాహరణ:- ఆంధ్రప్రదేశ్‌లో, నెల్లూరు జిల్లా, వెంకటగిరి తాలూకాలో 'మేల్చూరు' (మేల్చూరు = మేలైన చూరు = చూరు అనగా ఇంటిపై వేసే కప్పు). అనే గ్రామం వుంది. కాబట్టి 'తెలుగు వృక్షపు వేర్లు చెప్పలేనంత పాత కాలంవరకు పాతుకుపోయి వున్నవి'. అనే విషయం, తెలుగువారికి ఎంతో గౌరవాన్ని కలిగిస్తుంది.

## Reference Books :-


1) "Dilmun Discovered" By:- Michael Rice.
2) The Temple Complex at Barbar, Bahrain, A Description And Guide, Published By The Ministry of Information. The State of Bahrain. Page No 47.
3) "Looking for Dilmun" Page No. 47. By:- Geoffrey Bibby. Export Library Catalog No. 17 - 184062. Date 10 - 6 - 1973.
   Published By The Ministry of Information. The State of Bahrain.
4) "The Temple Complex at Barbar; Bahran A Description And Guide, Page No. 48.
   Pubilished By the Ministry of Information, The State of Bharain.
5) "Holy Bible" "Old Testament" "Genesis" Chapter - II. Verse - 2.
6) "Holy Bible" "Old Testament" "Genesis", Chapter - 9. Verse - 1

7) "Holy Bible" "Old Testament" "Genesis", Chapter - 17 Verse - 5

8) "Looking for Dilmun" - Page - 48. By Geoffrey Bibby.

9) "Looking for Dilmun" = Page = 58. By Geoffrey Bibby.

10) "Looking for Dilmun" - Page - 64. By Geoffrey Bibby.

11) "Bahrain Through The Ages" The Archaeology, Edited by "Shaikha Haya Ali Al Khalifa" And Michael Rice. Article Name:- "Mar-Tu and the Land of Dilmun" Page No. 246.
Published by The Ministry of Information State of Bahrain. Year - 1986.

12) "Dilmun Discovered" By Michael Rice.
Article :- "Burrows An Epigrapher in Dilmun Page No. 174.

13) "The Seafaring Merchants of UR, Page No. 7. By:- A.L. Oppenheim.
Oriental Institute, University of Chicago. U.S.A. Article - 9.

14) "The Seafaring Merchants of UR", By :- A.L. Oppenheim. Page No. 2.
Oriental Institute, University of Chicago. U.S.A. Article - 4.

15) "The Seafaring Merchants of UR", By:- A.L. Oppen heim. Page No. 10.
Oriental Institute, University of Chicago, U.S.A. Article - 13.

16) "Looking For Dilmun", By:- Geoffrey Bibby. Page No. 203.
Published By:- The Ministry of Information. State of Bahrain.
Date - 10 - 6 - 1973.
Export Library Catalog No. 17 - 184062.

17) "Looking for Dilmun" By. Geoffrey Bibby. Page No. 207

18) "The Seafaring Merchants of UR", By. A.L. Oppenheim Page No. 12.
Oriental Institute, University of Chicago, U.S.A: Article - 17.

19) ''మరుగునపడ్డ వారసత్వం'' తెలుగుసేత:- శ్రీ అన్నపరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, M.A., Published By. తెలుగు అకాడమి (1989). ఆంగ్ల మూలం. "Hidden Origins" By. శ్రీ సూర్యన్ కాశీ పాండ్యన్ , I.A.S., Published By. Stearling Publications Page No. 19.

20) "Looking for Dilmun" By. Geoffrey Bibby Page No. 47

21) "Holy Bible" Old Testament. Nehemiah. Chapter - 12. Verse - 12 And 24.

22) 'మరుగునపడ్డ వారసత్వం' తెలుగుసేత. శ్రీ అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి., M.A., Published By. తెలుగు అకాడమి. 1989. పరిశిష్టం 1.
ఆంగ్ల మూలం "Hidden Origins" By. శ్రీ. సూర్యన్‌కాశి పాండ్యన్ I.A.S.,
Published By. Sterling Publication.

23) "The Temple Complex At. Barbar, Bahrain. Adescription and Guide. Page No. 14.
Published By the Ministry of Bahrain. The State of Bahrain.

24) "The Seafaring Herchants of UR", By. A.L. Oppen Heim. Page No. 22.
Oriental Institute, University of Chicago, U.S.A.



## స్వీయ చిత్రం

అంజెలికా కఫ్‌మన్ తన రంగుల కుంచెల పొదితో మంచి నాజూకైన పోజులో కూచొంది.
కఫ్‌మన్ స్విస్ కళాకారిణి (1741 - 1807). ఇటలీ, స్విట్జర్లాండ్ దేశాలు పర్యటించింది.
1766లో లండన్ వచ్చింది. అక్కడ ఆమె కృషి, అందం, మూర్తిమత్వాలను అందరు మెచ్చుకొన్నారు.
ఆమె పౌరాణిక దృశ్యాలను, వ్యక్తుల చిత్రాలను వేసింది. రాయల్ అకాడెమీ స్థాపనలో ఉన్న
ఇద్దరు మహిళల్లో ఈమె ఒకర్తె. సర్ జోషువా రెనాల్డ్స్ అంటే ఆవిడ ఇష్టపడి చొరవ చూపింది కాని,
ఆ చొరవను అతడు నిరాకరించాడు. 1781లో ఆమె మొదటి భర్త చనిపోగా
తోటి ఆర్టిస్టు ఆంటోనియో జోచ్చిని వివాహమాడింది.

MISIMI/మిసిమి RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad-500 020. Postal Regd. No.H/SD/191.



## రాతి మన్మధుడు

ఈ రంగుల చిత్రణాన్ని శిల్పం అని పిలిచారు. ఇందులో అంజెలికా కఫ్మన్ ''నిదురిస్తున్న మన్మధుడు'' చిత్రానికి చివరి సవరణలను చెక్కుతున్న బొద్దుగా ఉండే పిల్లలను ఇందులో చిత్రించింది.